లీ సర్వే పనులను పకడ్బందీగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

- క్షేత్రస్థాయిలో భూముల లీ సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్



జగిత్యాల, నవంబర్ 04, ప్రజా జ్యోతి. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని వల్లంపల్లి మరియు తొంబారావుపేట్ గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కొనసాగుతున్న రీ సర్వే పనుల పురోగతిని, సర్వే నిర్వహిస్తున్న విధానాన్ని, భూరికార్డుల వివరాలను

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
గురువారం | 5 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 12

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- రైతులకు నాణ్యమైన విద్యుత్, సాగునీరు అందిస్తున్నాం
- ఆరుతడి పంటల సాగుతోనే ఎల్లనినో ప్రభావాన్ని అధిగమించవచ్చు
- బీఆర్ఎస్‌ది అసత్య ప్రచారం.. కరువుపై కనీస అవగాహన లేకుండా విమర్శలు
- సబ్సిడీపై ఆరుతడి విత్తనాలు పంపిణీ చేసిన
- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



సుల్తానాబాద్, నవంబరు 4(ప్రజాజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్, సాగునీటితో పాటు సబ్సిడీపై విత్తనాలు అందిస్తూ వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను విస్మరించి బీఆర్ఎస్ నాయకులు కల్లిబొల్లి మాటలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు.బుధవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ

మిగతా 2 లో...

- కోరుట్ల అయ్యప్పగుట్ట కింద వ్యవసాయ బావిలో ప్రభుత్వ మందులు.. వైద్య వ్యర్థాల డంపింగ్!
- 2023, 2024, 2025లో గడువు ముగిసిన మందులు దర్శనం
- తెలంగాణ ప్రభుత్వ సరఫరా ముద్రలతో బయటపడ్డ మందుల పెట్టెలు
- సూదులు, సిరంజీలు, గ్లౌసులు, ల్యాబ్ సామగ్రి బావిలోనే..
- పక్కనే పది ఎకరాలకు పైగా సాగు.. ఆందోళనలో రైతులు
- మందుల మూలం ఏది? బావిలోకి చేర్చింది ఎవరు?
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్



మావి కాని ప్రాణాలు.. ఉంటేనేంటి.. పోతేనేం!

కోరుట్ల,నవంబర్ 04 ప్రజాజ్యోతి పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు ప్రభుత్వం సరఫరా చేసిన మందులు.. చివరకు వ్యవసాయ బావిలో కుప్పలుగా దర్శనమివ్వడం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన మందులు.. పర్యావరణానికి ముప్పుగా మారుతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. గడువు ముగిసిన మందులు నుంచి వైద్య పరికరాల వరకు భారీ మొత్తంలో వ్యవసాయ బావిలో పడేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమా? లేక దీని వెనుక మరేదైనా వ్యవహారం ఉందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఐదో వార్డు అయ్యప్ప గుట్ట కింద యాకిన్‌పూర్ రోడ్డులోని రారాజు ఫంక్షన్ హాల్ వెనుక బేకరీ సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో ఈ మందులు, వైద్య వ్యర్థాలు బయటపడటం స్థానికంగా చర్చనీయాంశ మైంది. బావిలో సుమారు రెండు లోడింగ్ ఆటోలు లేదా ఒక వ్యాన్ నిండేంత పరిమాణంలో మందులు, వైద్య సామగ్రి ఉన్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడైంది. 2023, 2024, 2025 సంవత్సరాల్లో గడువు ముగిసిన మందులతో పాటు విప్పని పెట్టెలు, ట్యాబ్లెట్ షీట్లు, సిరంజీలు, సూదులు, గ్లౌసులు, ల్యాబ్ పరికరాలు

మిగతా 2 లో...

మాతృ, శిశు మరణాల నివారణకు సమష్టి కృషి చేయాలి

- గర్భిణులకు సకాలంలో వైద్య సేవలు, అవగాహన కల్పించాలి
- జిల్లాలో ఇప్పటివరకు రెండు మాతృ మరణాలు, ఐదు శిశు మరణాల నమోదు
- వైద్య సిబ్బందికి స్పష్టం చేసిన డీఎంహెచ్ఓ డాక్టర్ వై. పవిత్ర



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 4 ప్రజాజ్యోతి: మాతృ, శిశు మరణాల నివారణ వైద్య ఆరోగ్యశాఖకు అత్యంత ప్రాధాన్యత కావాలి. గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, గర్భధారణ

మిగతా 2 లో...

జగిత్యాల దత్తత బాలుడి కేసులో బిగ్ ట్విస్ట్!

- తల్లిదండ్రులకు అప్పగింపై రిట్ పిటిషన్ వేసిన కలెక్టర్ సత్యప్రసాద్..
- మళ్లీ శిశు సంక్షేమ కేంద్రానికే తరలించాలని కోర్టుకు విజ్ఞప్తి!



జగిత్యాల ప్రతినిధి, నవంబర్04 (ప్రజాజ్యోతి): జగిత్యాల జిల్లాలో తీవ్ర కలకలం రేపిన చిన్నారి దత్తత వ్యవహారం మళ్లీ కొత్త మలుపు తిరిగింది. మూడేళ్లుగా కంటికి రెప్పలా పెంచుకుంటున్న బాలుడిని చట్టపరమైన దత్తత నిబంధనల సాకుతో జిల్లా అధికారులు,చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ తల్లిదండ్రుల నుంచి వేరు చేసి శిశు సంక్షేమ కేంద్రానికి తరలించిన ఘటనపై తీవ్ర దుమారం రేగిన సంగతి తెలిసిందే.తమ బిడ్డకోసం ఆ తల్లిదండ్రులు పడిన వేదన, అధికారుల వద్ద బాలుడు రోదించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం, ఆపై బాధితులు హైకోర్టును ఆశ్రయించడంతో అక్టోబర్ 16న హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది.బాలుడిని వెంటనే తల్లిదండ్రులకు అప్పగించాలని స్పష్టం చేయడంతో అధికారులు బిడ్డను వారికి అందజేశారు. అయితే, ఈ వ్యవహారంలో చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్,

మిగతా 2 లో...

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి...)

సహకార సంఘం కార్యాలయ ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరుతడి విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత లేదని, రైతులకు రోజుకు 12 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు.



సాగునీటి కోసం ప్రత్యేక చొరవ

వేసవిలో పంటలు ఎండిపోకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌తో కలిసి ఒప్పించి ఎనిమిది నియోజకవర్గాలకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయించామని విజయరమణారావు తెలిపారు. దీంతో చెరువులు, కుంటలు, బావుల్లో నీటిమట్టం పెరిగి భూగర్భ జలాలు వృద్ధి చెందాయని వివరించారు. నియోజకవర్గంలో సుమారు 24 వేల ఎకరాల్లో వరి సాగు జరిగిందని పేర్కొన్నారు. రైతులు ధాన్యాన్ని ఐకేపీ, సింగిల్‌విండో, వ్యవసాయ మార్కెట్ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చని, లాభదాయక ధర లభిస్తే మిల్లర్లకు కూడా అమ్ముకోవచ్చని సూచించారు.

ఆరుతడి పంటల వైపు మళ్లాలి

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయని, భూగర్భ జలాలు తగ్గే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ప్రభుత్వం ఎస్సీ రైతులకు ఉచితంగా, ఇతర రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరువు పరిస్థితులపై కనీస అవగాహన లేకుండా ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలకు దిగడం సరికాదన్నారు.

కాళేశ్వరం నీళ్లు ఎక్కడికి వచ్చాయో చెప్పాలి

కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే అనేక సాగునీటి ప్రాజెక్టులకు పునాదులు పడ్డాయని విజయరమణారావు గుర్తుచేశారు. ఎస్సారెస్పీ కాలువల నిర్మాణానికి ఇందిరాగాంధీ హయాంలోనే శ్రీకారం చుట్టారని, అప్పటి నుంచి రైతులకు సాగునీరు అందుతోందన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నబీఆర్ఎస్ప్రభుత్వం ఎస్సారెస్పీ కాలువల అభివృద్ధికి అదనంగా ఒక్క నిర్మాణం కూడా చేపట్టలేదని విమర్శించారు.కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినా నేడు కూలిపోయిన పరిస్థితి నెలకొందని, ప్రాజెక్టును సందర్శిస్తున్న కొందరు నాయకులు అక్కడి నుంచినీటిని ఎత్తిపోసి సాగునీరు అందిస్తామంటూ అవగాహన లేని వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. నీటిని ఎక్కడి నుంచి, ఎలా ఎత్తిపోస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మంత్రి హరీశ్‌రావు పెద్దపల్లి జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు కాళేశ్వరం నీళ్లు పెద్దపల్లి జిల్లాను ముద్దాడుతాయని చెప్పారని గుర్తుచేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏ నియోజకవర్గానికి కాళేశ్వరం నీళ్లు అందించారో నిరూపించాలని, నిరూపిస్తే తాను ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు.

యూరియాపై అవగాహన లేకుండా విమర్శలా?

యూరియా సరఫరా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, ఆ విషయం తెలియకుండా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం బీఆర్ఎస్ నాయకుల అవగాహనారాహిత్యానికి నిదర్శనమని అన్నారు.రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్లు శ్రీగిరి శ్రీనివాస్, చిలుక సతీష్, కల్లెపల్లి జూనీ, కృషి విజ్ఞాన శాస్త్రవేత్త సంపత్, సింగిల్‌విండో సీఈవో బూరుగు సంతోష్, మండల వ్యవసాయ అధికారి పైడితల్లి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దన్నాయక్ దామోదర్‌రావు, రైతు సెల్ మండల అధ్యక్షుడు పన్నాల రామన్న, సర్పంచులు కాంపల్లి సతీష్‌కుమార్, గుండేటి దేవేందర్, ఏరుకొండ ప్రవంతి రమేష్, కర్రె గట్టయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు ఉట్ల వరప్రదీప్, తొర్రికొండ ప్రభాకర్, చింతల రాజు, అమీరిశెట్టి శ్రావణి రాకేష్, సింగిల్‌విండో డైరెక్టర్లు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాతృ, శిశు మరణాల నివారణకు సమష్టి కృషి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

నుంచి ప్రసవం వరకు అందించాల్సిన వైద్య సేవలను సకాలంలో అందించడంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం పెద్దపల్లిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో మాతృ, శిశు మరణాలపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు నమోదైన రెండు మాతృ మరణాలు, ఐదు శిశు మరణాలకు సంబంధించిన పూర్తి వివరాలను సమీక్షించారు. ఆయా మరణాలకు దారితీసిన పరిస్థితులు, వైద్య సేవల అందింపు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ వై. పవిత్ర మాట్లాడుతూ మాతృ, శిశు మరణాలు లేని సమాజమే లక్ష్యంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని అన్నారు. ప్రతి గర్భిణీ ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన పరీక్షలు, వైద్య సేవలు నిర్దిష్ట సమయంలో అందించాలని సూచించారు. గర్భిణులకు మాత్రమే కాకుండా వారి కుటుంబ సభ్యులకు కూడా ఆరోగ్యపరమైన అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గుర్తించి తగిన వైద్యం అందించడం ద్వారా మాతృ, శిశు మరణాలను నివారించేందుకు కృషి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ సుధాకర్ రెడ్డి, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ లక్ష్మీ భవాని, డాక్టర్ అతుల్య, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) నుంచి వచ్చిన గైనకాలజిస్టులు, చిన్నపిల్లల వైద్యనిపుణులు, సంబంధిత వైద్యాధికారులు, డీపీహెచ్ఎన్ఓ దయామని, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వే పనులను పకడ్బందీగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి...)

సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే ప్రక్రియను చేపట్టాలని,భూముల హద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రీ సర్వే ద్వారా భూ రికార్డుల్లో ఖచ్చితత్వం ఉండేలా చూడాలని,నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, మేడిపల్లి మండల తహసీల్దార్ , సంబంధిత అధికారులు మరియు సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

జగిత్యాల దత్తత బాలుడి కేసులో బిగ్ ట్విస్ట్!

(మొదటి పేజీ తరువాయి...)

జిల్లా యంత్రాంగం సరికొత్త ట్విస్ట్ ఇచ్చాయి.

హైకోర్టు తీర్పుపై స్టే విధించాలి:గతంలో బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తూ ఇచ్చిన తీర్పుపై వెంటనే స్టే విధించి, చిన్నారిని తిరిగి శిశు సంక్షేమ కేంద్రానికి తరలించాలని కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు రిట్ పిటిషన్ దాఖలు చేశారు.నిబంధనలు, అధికారులు సమర్పించిన నివేదికలు మరియు ఆధారాలను సరిగ్గా పరిశీలించకుండానే గతంలో అప్పగింత ఉత్తర్వులు వెలువడ్డాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. కేవలం హిందూ సంప్రదాయాల ప్రకారం దత్తత తీసుకుంటే దాన్ని చట్టపరంగా చెల్లుబాటయ్యే ప్రక్రియగా పరిగణించవచ్చా లేదా అనే అంశాన్ని న్యాయస్థానం క్షుణ్ణంగా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.బాలుడు ప్రస్తుతం ఉన్న తల్లిదండ్రుల వద్దే ఉంటే కేసు విచారణకు తీవ్ర ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉందన్న అధికారులు, గత ఉత్తర్వులను పునఃపరిశీలించే వరకు బిడ్డనుచైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ రక్షణలోనే ఉంచాలని కోర్టును అభ్యర్థించారు. అధికారుల తీరుపై ఒకవైపు ప్రజాసంఘాలు, పౌరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, జిల్లా కలెక్టర్ మళ్లీ హైకోర్టులో పిటిషన్ వేయడం ఈ కేసును మరిన్ని న్యాయపోరాటాల వైపు నడిపిస్తోంది.

శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఎస్పీ

వేములవాడ,నవంబర్,4:ప్రజాజ్యోతి. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధాలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని కరీంనగర్ విజిలెన్స్ ఎస్పీ.జి. బసవ రెడ్డి బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి విచ్చేసిన ఎస్పీ కి ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తితో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం మండపంలో వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ ఈ.వో రమాదేవి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ పిఆర్ఓ పెరిక శ్రీనివాస్,ఆలయ పర్యవేక్షకులు నరేందర్ సీనియర్ అసిస్టెంట్ నక్క తిరుపతి, ఆలయ ఉద్యోగులు మరియు వేద పండితులు పాల్గొన్నారు.

మావి కాని ప్రాణాలు.. ఉంటేనేంటి.. పోతేనేం!

(మొదటి పేజీ తరువాయి...)

కనిపించడం మరింత ఆందోళన కలిగిస్తోంది.

– ప్రభుత్వ మందులు బావిపాలు ఎలా అయ్యాయి?

బావిలో లభించిన మందుల ప్యాకెట్లపై తెలంగాణ ప్రభుత్వ సరఫరా ముద్రలు, తయారీ సంస్థల పేర్లు, బ్యాచ్ నంబర్లు కనిపిస్తున్నాయి. క్షయ వ్యాధి చికిత్సకు ఉపయోగించే మందులతో పాటు ఇతర ఔషధాలు కూడా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు, వైద్య కేంద్రాలకు సరఫరా కావాల్సిన మందులు వ్యవసాయ బావిలోకి ఎలా చేరాయి? వాటిని ఎవరు తరలించారు? ఏ అధికారి అనుమతితో బయటకు పంపించారు? అన్నది తేలాల్సి ఉంది.

– పది ఎకరాల పంటలకు ముప్పు పొంచి ఉందా?

బావికి సమీపంలోనే పది ఎకరాలకు పైగా వరి, మొక్కజొన్న పంటలు సాగవుతున్నాయి. దీంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. బావిలోని మందుల అవశేషాలు భూమిలోకి ఇంకితే పంటలపై ప్రభావం పడుతుందా? నీటి వనరులు కలుషితమవుతాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే బావి నీటితో పాటు సమీప సాగునీరు, వ్యవసాయ భూముల నుంచి నేల నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

– గడువు ముగిసిన మందులు.. పర్యవేక్షణ ఏమైనట్లు?

2023లో గడువు ముగిసిన మందులతో పాటు 2024, 2025లో కాలం చెల్లిన మందులు కూడా ఒకే ప్రాంతంలో కనిపించడం పలు అనుమానాలకు తావిస్తోంది.మందుల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన బాధ్యత ఎవరిది? గడువు ముగిసే లోపు అవసరమైన ఆసుపత్రులకు ఎందుకు పంపిణీ చేయలేదు? మిగిలిపోయిన మందులను నిబంధనల ప్రకారం ఎందుకు నిర్వీర్యం చేయలేదు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



– ఆసుపత్రి నుంచి వచ్చాయా? ఆరోగ్య కేంద్రం నుంచి వచ్చాయా?

కోరుట్ల ప్రభుత్వ వంద పడకల ఏరియా ఆసుపత్రి, అయ్యప్పగుట్ట అర్బన్ హెల్త్ సెంటర్ లేదా ఇతర ప్రభుత్వ వైద్య కేంద్రాల నుంచి ఈ మందులు వచ్చాయా అన్నది ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది. బ్యాచ్ నంబర్లు, స్టాక్ రిజిస్టర్లు, సరఫరా చలాన్లు, మందుల పంపిణీ వివరాలను పరిశీలిస్తే అసలు మూలం బయటపడే అవకాశం ఉంది.అయితే ఆధారాలు లేకుండా ఏ ఒక్క వైద్య కేంద్రానికీ బాధ్యతను ఆపాదించలేని పరిస్థితి ఉంది.

– వైద్య వ్యర్థాల పారవేతకు నిబంధనలు లేవా?

బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు–2016 ప్రకారం గడువు ముగిసిన మందులు, ఉపయోగించిన వైద్య పరికరాలు, సూదులు, ఇతర వ్యర్థాలను నిర్దేశిత పద్ధతిలోనే పారవేయాలి. వ్యవసాయ బావుల్లో పడేయడం అనుమతించిన విధానం కాదు.ఈ వ్యర్థాలను నిర్వీర్యం చేసినట్లు రికార్డులు ఉన్నాయా? అధీకృత సంస్థకు అప్పగించారా? లేక ఎలాంటి అనుమతులు లేకుండా రహస్యంగా బావిలో పడేశారా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది.

– బాధ్యులపై చర్యలు తీసుకుంటారా?

ఈ వ్యవహారంలో నిర్లక్ష్యం నిర్ధారణ అయితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలతో పాటు వర్తించే పర్యావరణ చట్టాల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది.స్టోర్ ఇన్‌చార్జి నుంచి సంబంధిత వైద్యాధికారుల వరకు ఎవరి పాత్ర ఎంత ఉందన్నది విచారణలో వెల్లడికావాల్సి ఉంది.

– కలెక్టర్ జోక్యం చేసుకోవాలి.. సమగ్ర విచారణ జరపాలి!

కోరుట్లలో బయటపడిన ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.వైద్య, ఆరోగ్యశాఖ, ఔషధ నియంత్రణ శాఖ, కాలుష్యనియంత్రణ మండలి, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. బావిలో ఉన్న మందులు, వైద్య వ్యర్థాలను ఆధారాలు నమోదు చేసిన తర్వాత నిబంధనల ప్రకారం తొలగించాలి.నీరు, నేల నమూనాలను పరీక్షించి రైతులకు వాస్తవ పరిస్థితిని తెలియజేయాలి. ప్రభుత్వ మందులు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరు పారవేశారు? ఎంత విలువైన ప్రజాధనం వృథా అయింది? అనే అంశాలపై పూర్తి వివరాలు ప్రజల ముందుంచాలి.పేదల ప్రాణాలు కాపాడాల్సిన ప్రభుత్వ మందులు..ఇలా వ్యవసాయ బావుల్లో దర్శనమివ్వడం వెనుక అసలు కథ ఏమిటో అధికారుల విచారణలోనైనా బయటపడుతుందా? బాధ్యులపై చర్యలు ఉంటాయా? లేక ఈ వ్యవహారం కూడా మరుగున పడిపోతుందా? వేచి చూడాల్సిందే!

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన
- ఆరో వార్డు కౌన్సిలర్ భాకం సాయికిరణ్ యాదవ్



సుల్తానాబాద్, నవంబర్ 4 (ప్రజా జ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆదేశాలు, సహకారంతో ఆరవ వార్డులోని ప్రతి ఇంటికి చేరుస్తానని వార్డు కౌన్సిలర్ భాకం సాయికిరణ్ యాదవ్ స్పష్టం చేశారు. వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.బుధవారం సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఆరవ వార్డు సుభాష్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి కౌన్సిలర్ భాకం సాయికిరణ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డులు కేవలం నిత్యావసర సరుకుల పంపిణీకే కాకుండా, భవిష్యత్తులో ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తోందని కొనియాడారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత నిస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ఆయన సహకారంతో ఆరవ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని అన్నారు.మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు తదితర సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జీపీఓ మహేందర్ రెడ్డి, అంగన్ వాడీ టీచర్ సరోజన, కాంగ్రెస్ పార్టీ నాయకులు న్యాతరి దేవేందర్ కుమార్, ఆరేపల్లి రత్నం, వార్డు మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయనిత్యాన్నదానం ట్రస్టుకు ₹1.50 లక్షల విరాళం



వేములవాడ,నవంబర్,4ప్రజాజ్యోతి:రాజన్నసిరిసిల్లజిల్లాప్రముఖపుణ్యక్షేత్రమైనవేములవాడశ్రీరాజరాజేశ్వరస్వామిదేవస్థానంనిత్యాన్నదానంట్రస్టుకుకామారెడ్డికిచెందినబెజుగంశ్రీకాంత్రెడ్డి–మంగనిసంధ్యారాణిదంపతులురూ. 1,50,000/–(లక్షాయాభైవేలరూపాయలు)విరాళంగాఅందజేశారు.బెజుగంలింగారెడ్డికుమారుడైనశ్రీకాంత్రెడ్డిదంపతులుబుధవారంఆలయప్రోటోకాల్కార్యాలయంలోదేవస్థానంకార్యనిర్వహణాధికారి(ఈ.వో)రమాదేవికలిసివిరాళంనగదురూపంలోఅందజేశారు. దాతలకుఆలయఅధికారులుస్వామివారిశేషవస్త్రాలు,ప్రసాదాలుఅందజేసివేదాశీర్వచనంగావించారు.ఆలయపెరికశ్రీనివాస్,ఆలయసిబ్బందిపాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- ధాన్యం విక్రయించిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ
- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు



సుల్తానాబాద్ నవంబర్ 4(ప్రజా జ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సూచించారు. బుధవారం మండలంలోని సుద్దాల, అల్లిపూర్ గ్రామాల్లో సింగిల్ విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని ముందస్తుగా ఎదుర్కొనేందుకు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, సింగిల్ విండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి, చిలుక సతీష్, సీఈవో సతీష్, సర్పంచులు కోదాటి సాయికిరణ్, సంపత్, ఏపీఎం, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తాం

- : ఏఎంసీ చైర్మన్ అరుట్ల మహేష్ రెడ్డి
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఏఎంసీ పాలకవర్గం



ముస్తాబాద్, నవంబర్ 4 (ప్రజా జ్యోతి):రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్‌గా అవకాశం కల్పించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌ను ఏఎంసీ చైర్మన్ అరుట్ల మహేష్ రెడ్డి, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా తమపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా అంకితభావంతో పనిచేస్తామని, రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అరుట్ల మహేష్ రెడ్డి, నామాపూర్ సర్పంచ్ మాదాసు అనిల్, కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి ఏళ్ల బాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు గజ్జల రాజు, ఉపసర్పంచ్ తాడేపు కొమురయ్య, తాళ్ల విజయ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ సడిమెల బాలయ్య, డైరెక్టర్లు గూడ సిద్ధారెడ్డి, అన్నమేని రాజు, గాంత రాజు, పోచమ్మల వనిత, సద్ది మధు, ముక్క నరసింహులు, బత్తుల నవీన్, డాకూరి మహేందర్, ఊరటి ప్రశాంత్, కుంభాల యాదగిరి రెడ్డి, చేపూరి రమేష్, ఎదునూరి భాను, పోతారం వంశీ, మెంగని వివేక్ తదితరులు పాల్గొన్నారు.

విజయలక్ష్మి ఫైర్ వర్క్స్ ప్రారంభించిన విప్

వేములవాడ,నవంబర్,4 ప్రజా జ్యోతి: వేములవాడ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన విజయలక్ష్మి ఫైర్ వర్క్స్ పటాసుల దుకాణాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా దుకాణాన్ని ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపార రంగంలో అభివృద్ధి సాధిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.



జీవితానికి మార్గదర్శి భగవద్గీత

- డిసెంబర్ 6న జిల్లా స్థాయి భగవద్గీత కంఠస్థ శ్లోక పోటీలు
- వీహెచ్‌పి మంథని ప్రఖండ అధ్యక్షులు రావుల సతీష్



మంథని, నవంబర్ 04 (ప్రజాజ్యోతి):విద్యార్థుల్లో చదువుతోపాటు సంస్కారాన్ని దేశభక్తిని నైతిక విలువలను సాధించే లక్ష్యంతో విశ్వహిందూ పరిషత్ సంస్కార శిక్షణ విభాగం ఆధ్వర్యంలో 2026 శ్రీమద్ భగవద్గీత కంఠస్థ శ్లోక పోటీలు నిర్వహించినట్లు విశ్వహిందూ పరిషత్ మంథని ప్రఖండ అధ్యక్షులు రావుల సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా రావుల సతీష్ మాట్లాడుతూ జీవితానికి మార్గదర్శి అయిన భగవద్గీత నుంచి ఎంపిక చేసిన కంఠస్థ శ్లోకాలతో పోటీలు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయి పోటీలను డిసెంబర్ 6న పెద్దపెల్లిలో నిర్వహించిన అనంతరం రాష్ట్ర స్థాయి పోటీలను హైదరాబాదులో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పోటీలను మూడు విభాలుగా విభజించామని అందులో 3, 4, 5, తరగతుల విద్యార్థులు 1 నుండి 10 శ్లోకాలు, 6, 7 తరగతుల విద్యార్థులు 1 నుండి 15 శ్లోకాలు, 8, 9, 10 తరగతుల విద్యార్థులు 1 నుండి 40 శ్లోకాలు కంఠస్థం చేయాల్సి ఉంటదని తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ఒక్కో విభాగం నుంచి ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి జిల్లా స్థాయి పోటీలకు పంపించాలని వీటికి సంబంధించిన పుస్తకాలు రెండు రోజుల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తమ కార్యకర్తలు అందజేస్తారని తెలిపారు.ఇతర వివరాల కోసం 9951 490 553 ఫోన్ నెంబర్లో సంప్రదించాలని ఆయన కోరారు.

రాజన్న ఆలయానికిరూ.5లక్షలవిలువైనవెండి కానుకసమర్పించినవరంగల్,భక్తులు





వేములవాడ నవంబర్,4 ప్రజాజ్యోతి:రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి వరంగల్‌కు చెందిన భక్తులు శ్రీతనుగుల . రత్నాకర్ – అన్నపూర్ణ దంపతులు భారీ కానుకను సమర్పించారు. తమ కుమారుడు జయంత్ పేరిట సుమారు 2 కిలోల బరువు గల వెండి గంప, బిందె, ప్లేట్‌ను తయారు చేయించి స్వామివారికి కానుకగా అందజేశారు.ఈ కానుకల విలువ సుమారు ₹ 5,00,000 (ఐదు లక్షల రూపాయలు) ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. రాజన్న ఆలయ ప్రాంగణంలో ఆలయ ఈ.వో రమాదేవికి భక్తులు ఈ వెండి వస్తువులను స్వయంగా అందజేశారు. దేవస్థానం డిప్యూటీ ఈవో ప్రతాప నవీన్ కుమార్ ,ఇతర ఆలయ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ మంథని విద్యార్థుల విజయకేతనం

మంథని, నవంబర్ 04 (ప్రజాజ్యోతి): పెద్దపెల్లి జిల్లా స్థాయిలో నిర్వహించిన వివిధ క్రీడా, సృజనాత్మక పోటీల్లో మంథని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. డ్రాయింగ్ పోటీలో సర్వ నేహా మొదటి బహుమతి సాధించగా, మెడిసిన్ బాల్ పోటీలో రుత్విక రెండవ బహుమతి సాధించింది. చెస్ పోటీలో మణిదీప్ మొదటి బహుమతి, రాజకుమార్ రెండవ బహుమతి సాధించారు. విజేతలకు జిల్లా విద్యాశాఖాధికారి శారద చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమలత, ఉపాధ్యాయ బృందం, ఐఈఆర్ పీలు శ్రీనివాస్ , సౌజన్య విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రీడలు, కళలు, ఇతర సృజనాత్మక రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల విజయాలు పాఠశాలకు గర్వకారణం.



ఈనెల 28న నవోదయ ప్రవేశ పరీక్ష

చొప్పదండి, నవంబర్ 4 (ప్రజాజ్యోతి): కరీంనగర్ జిల్లా చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 28వ తేదీన ముందుగా నిర్ణయించిన ప్రకారమే నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 20 పరీక్ష కేంద్రాల్లో 3888 విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులు తమ అడ్మిట్ కార్డులను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు.

ప్రొఫెసర్ కోకటే మృతి ఫార్మసీ విద్యారంగానికి తీరని లోటు

► **సీవీఎం కళాశాల చైర్మన్ డా. శ్రీధర్ చాట్ల**



కరీంనగర్‌రూరల్,నవంబర్ 04ప్రజాజ్యోతి ప్రముఖ విద్యావేత్త, ఫార్మసీ విద్యారంగ అభివృద్ధికి విశేష సేవలందించిన ప్రొఫెసర్ (డా.) సి.కె. కోకటే మృతి విద్యారంగానికి తీరని లోటని సీవీఎం కాలేజ్ ఆఫ్ ఫార్మసీ చైర్మన్ డా. శ్రీధర్ చాట్ల, ప్రిన్సిపాల్ డా. బి. రాజా నరేందర్ అన్నారు.బుధవారం వెలిచాలలోని సీవీఎం కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ప్రొఫెసర్ కోకటే చిత్రపటానికి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చైర్మన్ డా. శ్రీధర్ చాట్ల మాట్లాడుతూ..ఫార్మసీ విద్య అభివృద్ధికి ప్రొఫెసర్ కోకటే అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన మరణం విద్యారంగానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ప్రిన్సిపాల్ డా. బి. రాజా నరేందర్ మాట్లాడుతూ అంకితభావం, క్రమశిక్షణ, నిరాడంబరతకు ప్రతీకగా ప్రొఫెసర్ కోకటే నిలిచారని కొనియాడారు.ఫార్మసీ విద్యారంగంలో ఆయన చేసిన విశేష కృషి భావితరాల విద్యార్థులకు, అధ్యాపకులకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేములవాడ ఆలయ గోశాల తనిఖీ ఈఓ నవీన్ కుమార్ పరిశీలన



వేములవాడ,నవంబర్,4ప్రజాజ్యోతి: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన తిప్పాపురం గోశాలను ఆలయ డిఈఓ (డి ఈ ఓ) ప్రతాప నవీన్ కుమార్ పరిశీలించారు.గోశాలలోని వివిధ షెడ్లను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేసి, గోవులకు అందిస్తున్న పచ్చిగడ్డి, ఎండుగడ్డి, తాగునీరు తదితర వసతులను స్వయంగా పరిశీలించారు.గోవుల ఆరోగ్యం, వాటికి అందిస్తున్న సంరక్షణ చర్యలపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గోశాల ఆవరణలో ప్రస్తుతం జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గోవుల సంరక్షణలో ఎలాంటి అజాగ్రత్త వహించవద్దని, గోశాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.కార్యక్రమంలో ఆలయ ఇన్చార్జ్ డీ.ఈ రామ్ కిషన్ రావు, సీనియర్ అసిస్టెంట్ సంకపెల్లి పవన్, ప్లంబర్ కమలాకర్ తో పాటు గోశాల నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలి

♦ **బ్యాంక్ ఆఫ్ బరోడా అసిస్టెంట్ మేనేజర్ భూక్య పడావ్**

కొనరావుపేట, నవంబర్ 04 (ప్రజాజ్యోతి)





కేంద్ర ప్రభుత్వం పేదలు, సామాన్య ప్రజల ఆర్థిక భద్రత కోసం అమలు చేస్తున్న బీమా, పెన్షన్ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ ఆఫ్ బరోడా కనగర్తి బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ భూక్య పడావ్ కోరారు. బ్యాంక్ ఆఫ్ బరోడా కనగర్తి బ్రాంచ్ ద్వారా ఖాతాదారులకు అందిస్తున్న కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలతో పాటు తక్కువ వడ్డీ రేట్లకు అందిస్తున్న గోల్డ్ లోన్ సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం బ్యాంక్ ఆఫ్ బరోడా కనగర్తి బ్రాంచ్ ఆధ్వర్యంలో ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ భూక్య పడావ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిరుపేదలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం పలు ఆర్థిక భద్రత పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాలను కలిగి ఉండటంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న బీమా, పెన్షన్ పథకాలలో భాగస్వాములు కావాలని సూచించారు.ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్బివై)ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పిఎంజెజెబివై), అటల్ పెన్షన్ యోజన (ఎపివై) వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. ఈ పథకాల ప్రయోజనాలు, అర్హతలు, వాటిలో చేరే విధానం గురించి ఖాతాదారులకు అవగాహన కల్పించారు. తక్కువ ప్రీమియంతో బీమా సౌకర్యం పొందే అవకాశం ఉన్నందున అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాలలో చేరాలని కోరారు.అదేవిధంగా బ్యాంక్ ఆఫ్ బరోడా కనగర్తి బ్రాంచ్ ద్వారా ఖాతాదారులకు అందిస్తున్న గోల్డ్ లోన్ సేవలను కూడా ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. అవసరమైన సమయంలో బంగారంపై తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు అందించే సదుపాయం బ్యాంకులో ఉందని, బ్యాంకు నిబంధనలకు అనుగుణంగా ఖాతాదారులు ఈ సేవలను పొందవచ్చని పేర్కొన్నారు.బ్యాంకు అందిస్తున్న ఇతర సేవలపై కూడా ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ కావడంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. బ్యాంకింగ్ సేవలు, బీమా పథకాలు, పెన్షన్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ఆర్థిక భద్రతను పెంపొందించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జిన్న అనూష అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రజిత, వార్డు సభ్యులు మొకెనపెల్లి బాలరాజు, ఛిద్రవేణి నరేష్, బ్యాంక్ మిత్ర ఛిద్రవేణి వెంకటేష్, బ్యాంక్ ఖాతాదారులు, గ్రామ ప్రజలు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

వేములవాడ రూరల్‌లో 'వికసిత్ భారత్ - జి రామ్ జి' మేట్ల శిక్షణా కార్యక్రమము

■ **అర్హులైన ప్రజలు ఇంకుడు గుంతలు, పశువుల షెడ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ పిలుపు**





వేములవాడ,నవంబర్,4ప్రజాజ్యోతి: వేములవాడ రూరల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, సర్పంచులు పంచాయతీ కార్యదర్శుల సంపూర్ణ సహకారంతో 'వికసిత్ భారత్ - జి రామ్ జి' (వి బి – జి రామ్ జి) పథకం కింద మేట్లకు ప్రత్యేక అవగాహన మరియు సమగ్ర శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో వేములవాడ రూరల్ మండల ప్రజాభివృద్ధి అధికారి (ఎంపీడీవో) శ్రీనివాస్ పాల్గొని వివరాలను సుదీర్ఘంగా వెల్లడించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 40 మంది మేట్లు ఈ శిక్షణా తరగతులకు హాజరై గ్రామీణాభివృద్ధి పనుల నిర్వహణపై పూర్తిస్థాయి అవగాహన పొందినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి జాబ్ కార్డ్ కలిగిన కుటుంబానికి, ప్రతి కూలీకి వారి అర్హతకు తగ్గట్టుగా సరిపడా పనులను కల్పించడమే కాకుండా, గ్రామాల్లో చేపట్టే కూలీ మరియు మెటీరియల్ పనులను ఎంతో నైపుణ్యంతో, పక్కా నాణ్యతా ప్రమాణాలతో సమర్థవంతంగా చేయించడమే ఈ శిక్షణ యొక్క ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. ప్రణాళికబద్ధంగా పనులు చేపట్టడానికి గ్రామ స్థాయిలో ముందుగా అనువైన పనులను గుర్తించి, గ్రామ పంచాయతీ సమావేశాల ద్వారా తీర్మానాలు ఆమోదించడం జరిగిందన్నారు. ఆ తీర్మానాలను అనుసరించి టెక్నికల్ అసిస్టెంట్లు (టి ఏ), ఉపాధి హామీ కార్యాలయ సిబ్బంది మరియు సహాయ ప్రోగ్రామ్ అధికారి (ఏ పి ఓ)ల సాంకేతిక, పరిపాలనా సహకారంతో పనులకు సంబంధించిన అంచనాలను (ఎస్టిమేషన్స్) పూర్తి చేసి, ఉన్నతాధికారుల నుండి అనేక రకాల అభివృద్ధి పనులకు మంజూరు సాధించామని తెలిపారు. ఈ విధంగా మంజూరైన పనులలో రైతులకు ప్రయోజనం చేకూర్చే ఫాం పాండ్లు (రైతు కుంటలు), భూగర్భ జలాల పెంపునకు తోడ్పడే బోరువెల్ రీఛార్జ్, గ్రామీణ పరిశుభ్రతను పెంచే వ్యక్తిగత మరియు కమ్యూనిటీ ఇంకుడు గుంతలు వర్షపు నీటిని భద్రపరిచే, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, రైతుల పశువుల సంరక్షణకు ఉపయోగపడే పశువుల షెడ్లు (కాటిల్ షెడ్స్), తోటల పెంపకానికి సంబంధించిన హార్టికల్చర్ పనులు, అలాగే గ్రామీణ మహిళల సాధికారతకు తోడ్పడే మహిళా సమాఖ్య (వి వో) భవనాల నిర్మాణాలు ఉన్నాయని ఎంపీడీవో వివరించారు. అలాగే ఈ కార్యక్రమంలో పశువుల సంక్షేమం మరియు తాగునీటి కొరత నివారణపై ఎంపీడీవో శ్రీనివాస్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. మానవులమైన మనం మన అవసరాలను, దాహార్తిని నోటి మాట ద్వారా అడిగితీర్చుకోగలమని, కానీ నోరు లేని మూగజీవాలు తమ అవసరాలను స్వయంగా చెప్పుకోలేవని భావోద్వేగంగా పేర్కొన్నారు. ఈ క్రమంలో గ్రామాల్లో పశువుల తాగునీటి కష్టాలను తీర్చడానికి మండల వ్యాప్తంగా అనువైన ప్రదేశాలలో 25 పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణాలను గుర్తించామని, వీటి నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపామని, త్వరలోనే ఇవన్నీ మంజూరై అందుబాటులోకి రానున్నాయని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి నీటి సంరక్షణ ఎంతగానో అవసరమని చెబుతూ, రైతులు తమ పొలాల్లో ఫాం పాండ్లు నిర్మించుకోవడం వల్ల వర్షపు నీరు నిల్వ ఉండి భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. అంతేకాకుండా ఆ ఫాం పాండ్లలో నిల్వ ఉండే నీటి ఆధారంగా రైతులు చేపల పెంపకం చేపట్టి అదనపు ఆదాయం పొందవచ్చని, అలాగే నీటి ఆధారంతో కూరగాయల సాగు చేసి ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఈ నిర్మాణాలు ఎంతో దోహదపడతాయని వివరించారు. దీనికి తోడు బోరువెల్ రీఛార్జ్ పిట్ల నిర్మాణం ద్వారా వర్షపు నీరు నేరుగా భూమిలోకి ఇంకి, ఎండిపోయిన బోరు బావులలో నీటిమట్టం పెరిగి వ్యవసాయానికి, తాగునీటికి తోడ్పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా మండల ప్రజలందరికీ ఆయన విజ్ఞప్తి చేస్తూ, గ్రామాల్లో తమ ఇళ్ల వద్ద వ్యక్తిగత ఇంకుడు గుంతలు లేదా పశువుల షెడ్లు వంటి నిర్మాణాలు అవసరమైన అర్హులైన ప్రతి ఒక్కరూ వెంటనే తమ పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మేట్లు ఈ శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలను తమ గ్రామాల పరిధిలో వినియోగించి, పంచాయతీల ప్రతినిధుల దృష్టికి ప్రజల అవసరాలను తీసుకెళ్తూ, పనుల్లో అత్యున్నత నాణ్యతను పాటించి వేములవాడ రూరల్ మండల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. ఏపీవో మల్లయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు ఆర్ వెంకటయ్య, పి కనకరాజు, ఈసీ శ్రీనివాస్, వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్స్ 46 మంది పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల్లో డిజిటల్ పాలనకు శ్రీకారం

- ఉద్యోగుల వివరాల నమోదు నవంబర్ 7లోగా పూర్తి చేయాలి
- డిసెంబర్ 1 నుంచి పూర్తిస్థాయిలో డిజిటల్ రికార్డుల నిర్వహణ
- అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కోశాధికారి కే. రమేష్



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 4 ప్రజా జ్యోతి :

ప్రభుత్వ శాఖల్లో పరిపాలనా వ్యవహారాలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం డిజిటలైజేషన్ పై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఉద్యోగుల వ్యక్తిగత వివరాల నుంచి కార్యాలయాల పరిపాలనా రికార్డుల వరకు ప్రతి అంశాన్ని డిజిటల్ విధానంలోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కోశాధికారి కే. రమేష్ అధికారులకు స్పష్టం చేశారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు ఈ-హెచ్ఆర్ ఎంఎస్ (e-HRMS), ఈ-శాంక్షన్ (e-Sanction) మాడ్యూళ్ల వినియోగంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అక్టోబర్ 17న జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా డిజిటలైజేషన్ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం జీఓ నంబర్లు 138, 139, 141లను విడుదల చేసిందని వివరించారు. ఈ విధానం అమలులో భాగంగా ప్రతి జిల్లాలో జిల్లా ట్రెజరీ అధికారి (DTO), పే అండ్ అకౌంట్స్ అధికారి (PAO) నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ-హెచ్ఆర్ ఎంఎస్, ఈ-శాంక్షన్, వామిస్ (WAMIS) మాడ్యూళ్ల వినియోగం, అమలుపై ఆయా శాఖల అధికారులకు శిక్షణ అందిస్తారని తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ వ్యక్తిగత ఈ-హెచ్ఆర్ ఎంఎస్ ఖాతాలోకి లాగిన్ అయి పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని, ఈ ప్రక్రియను నవంబర్ 7వ తేదీలోగా తప్పనిసరిగా పూర్తి చేయాలని కే. రమేష్ స్పష్టం చేశారు. ప్రతి శాఖ తమ పరిధిలో డిజిటలైజేషన్ అమలును పర్యవేక్షించేందుకు ఒక నోడల్ అధికారిని నియమించుకోవాలని ఆదేశించారు. ఉద్యోగులందరికీ ఈ విధానంపై అవగాహన కల్పించి గడువులోగా నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని సూచించారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి అన్ని ప్రభుత్వ శాఖల్లో పూర్తిస్థాయిలో డిజిటల్ రికార్డుల నిర్వహణ అమల్లోకి రావాలని, ఇందుకు అవసరమైన సన్నాహక చర్యలను ఇప్పటినుంచే పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. డిజిటల్ విధానం ద్వారా పరిపాలనలో పారదర్శకత పెరగడంతో పాటు ఉద్యోగులకు మెరుగైన సేవలు అందుతాయని, కార్యాలయాల్లో పనులు వేగంగా పూర్తయ్యేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో లు గంగయ్య, సురేష్, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేములవాడరాజరాజేశ్వరస్వామివేద పాఠశాలవిద్యార్థుల ప్రతిభ

- చతుర్వేదపరీక్షల్లో జయపత్రికలు సాధన





వేములవాడ,నవంబర్,4 ప్రజాజ్యోతి : శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న వేద పాఠశాల విద్యార్థులు చతుర్వేద పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జయపత్రికలు సాధించారు. ప్రతి సంవత్సరము పలెనే ఈ సంపత్సరం కూడా జనార్దనానంద స్వామి సంస్మృతి ట్రస్ట్ వారిచే నిర్వహించబడిన తెలంగాణ ప్రాంతీయ చతుర్వేద పరీక్షలకు ఈ వేద పాఠశాలలో 4 వేదములను అభ్యసిస్తున్న విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షల్లో సామవేదము నందు పూర్వ భాగము (మూలాంతము) లో వేద పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు విశేష ప్రతిభ చూపి ఉత్తీర్ణులయ్యారు: మునుగోటి షణ్ముఖ శర్మ – ఉత్తమ శ్రేణి (రజిత పతకం) కొంజర్ల లక్ష్మీనరసింహ శర్మ – ఉత్తమ శ్రేణి (రజిత పతకం) అన్నవరపు సత్యనారాయణ శాస్త్రి – ప్రథమ శ్రేణి రేవూరి షణ్ముఖ శర్మ – ప్రథమ శ్రేణి విశేషంగా ఉత్తమ శ్రేణిలో జయపత్రికలు పొందిన మునుగోటి షణ్ముఖ శర్మ, కొంజర్ల లక్ష్మీనరసింహ శర్మలకు రజిత పతకాలను బహూకరించారు. విద్యార్థులను అత్యుత్తమ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దినందుకు గాను వారి గురువు బ్రహ్మశ్రీ పాలకోడేటి జయరామ శర్మ ఉత్తమ అధ్యాపక సన్మానం చేశారు. ఏ.ఈ.ఓ నాగుల మహేష్ సీనియర్ అసిస్టెంట్ సూగురు సురేష్ చేతుల మీదుగా విద్యార్థులకు, గురువుకి సన్మానం మరియు పురస్కార ప్రదానం జరిగింది.

మాతృ, శిశు మరణాల నివారణకు సమష్టి కృషి చేయాలి

- గర్భిణులకు సకాలంలో వైద్య సేవలు, అవగాహన కల్పించాలి
- జిల్లాలో ఇప్పటివరకు రెండు మాతృ మరణాలు, ఐదు శిశు మరణాల నమోదు
- వైద్య సిబ్బందికి స్పష్టం చేసిన డీఎంహెచ్ఓ డాక్టర్ వై. పవిత్ర

పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 4 ప్రజా జ్యోతి : మాతృ, శిశు మరణాల నివారణ వైద్య ఆరోగ్యశాఖకు అత్యంత ప్రాధాన్యత కావాలి. గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, గర్భధారణ నుంచి ప్రసవం వరకు అందించాల్సిన వైద్య సేవలను సకాలంలో అందించడంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం పెద్దపల్లిలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో మాతృ, శిశు మరణాలపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు నమోదైన రెండు మాతృ మరణాలు, ఐదు శిశు మరణాలకు సంబంధించిన పూర్తి వివరాలను సమీక్షించారు. ఆయా మరణాలకు దారితీసిన పరిస్థితులు, వైద్య సేవల అందింపు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ వై. పవిత్ర మాట్లాడుతూ మాతృ, శిశు మరణాలు లేని సమాజమే లక్ష్యంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని అన్నారు. ప్రతి గర్భిణీ ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన పరీక్షలు, వైద్య సేవలు నిర్ణీత సమయంలో అందించాలని సూచించారు. గర్భిణులకు మాత్రమే కాకుండా వారి కుటుంబ సభ్యులకు కూడా ఆరోగ్యపరమైన అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గుర్తించి తగిన వైద్యం అందించడం ద్వారా మాతృ, శిశు మరణాలను నివారించేందుకు కృషి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ సుధాకర్ రెడ్డి, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ లక్ష్మీ భవాని, డాక్టర్ అతుల్య, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) నుంచి వచ్చిన గైనకాలజిస్టులు, చిన్నపిల్లల వైద్య నిపుణులు, సంబంధిత వైద్యాధికారులు, డీపీహెచ్ ఎన్ఓ దయామని, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం



ధర్మారం,నవంబర్ 4 (ప్రజా జ్యోతి): పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాగిరెడ్డి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. ధర్మారం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన కొక్కుల స్వరూప సూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న ఆయన స్వరూప, ఆమె కుమారుడు సతీష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్య సంగీత ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు సోగాల తిరుపతి, గ్రామశాఖ అధ్యక్షుడు కంపెల్లి పోచయ్య, సీనియర్ నాయకులు ఓరేం చిరంజీవి, ఈదుల రాజేందర్ రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మచ్చుపేట సర్పంచ్ చొరవతో యువతకు ఉపాధి బాట



ముత్తారం, నవంబర్ 04 (ప్రజా జ్యోతి) మండలంలోని మచ్చుపేట గ్రామంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సింగరేణి సంస్థ RG-1 స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో మచ్చుపేట గ్రామపంచాయతీ పరిధిలోని 22 మంది అభ్యర్థులకు NAC సెంటర్‌లో వెల్డింగ్ కోర్సులో నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిలివేరి జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తును మెరుగుపరుచుకోవాలని సూచించారు. సహకరించిన మంత్రి శ్రీధర్‌బాబు, సింగరేణి RG-1 జీఎం లలిత్ కుమార్, అధికారులకు అయన కృతజ్ఞతలు తెలిపారు. ఉపసర్పంచ్ దొంతుల రాకేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చదువుకున్న బడి రుణం తీర్చుకుంటున్న ఎమ్మెల్సీ

- అప్పన్నపేట జడ్పీహెచ్ఎస్‌కు 50 బెంచీల విరాళం
- ఎంకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్క కొమరయ్య సహకారం
- గతంలోనూ పాఠశాలకు ఆర్చ్, గేటు ఏర్పాటు

పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 4 ప్రజా జ్యోతి : తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తూ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య తనకున్న అనుబంధాన్ని చాటుకుంటున్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎంకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 బెంచీలను విరాళంగా అందించారు. ఒకప్పుడు తాను విద్యనభ్యసించిన పాఠశాలలో విద్యార్థులు కూర్చునేందుకు సరైన సదుపాయాలు లేవని తెలుసుకుని స్పందించిన ఆయన, బెంచీలను స్పాన్సర్ చేశారు. ఎంకే ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ, డీపీఎస్ ప్రో వైస్ చైర్మన్, శాసనమండలిలో బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మల్క కొమరయ్య అందించిన ఈ సహకారం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఇదే పాఠశాలకు స్కూల్ ఆర్చ్, గేటును కూడా అందించి అభివృద్ధికి తోడ్పడ్డారు. మల్క కొమరయ్య మాట్లాడుతూ తాను పదో తరగతి వరకు ఇదే ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నానని గుర్తుచేసుకున్నారు. బంధంపల్లి నుంచి ప్రతిరోజూ ఐదు కిలోమీటర్లు నడుచుకుంటూ అప్పన్నపేటకు వచ్చి విద్యనభ్యసించానని తెలిపారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల రుణం తీర్చుకోవడం బాధ్యతగా భావిస్తున్నానని, ఇక్కడ చదువుకున్న విద్యార్థిగా పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. పాఠశాలల అభివృద్ధి కి ఎంకే ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులోనూ సహకారం కొనసాగిస్తామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి అండగా నిలుస్తున్న ఎమ్మెల్సీ మల్క కొమరయ్యకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి కేటీఆర్‌కు ఆహ్వానం

► ఈ నెల 18న ఎల్లారెడ్డిపేటలో ఘనంగా ఎల్లమ్మ సిద్ధోగం



ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించనున్న ఎల్లమ్మసిద్ధోగం, దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను గౌడ సంఘం సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌కు వెళ్లిన గౌడ సంఘం ప్రతినిధులు కేటీఆర్‌ను ప్రత్యేకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, ఎల్లమ్మ గడను బహూకరించారు. ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని కేటీఆర్ సూచించినట్లు గౌడ సంఘం సభ్యులు తెలిపారు. ఈ మహోత్సవానికి కేటీఆర్ హాజరుకానున్నట్లు వారు వెల్లడించారు. ఆహ్వానాన్ని స్వీకరించిన కేటీఆర్‌కు గౌడ సంఘం సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, ఎల్లారెడ్డిపేట పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచ్ ఎలగందుల నర్సింలు, గౌడ సంఘం అధ్యక్షుడు ఎర్ర దేవయ్య, పందిళ్ల లింగం గౌడ్, బాలగౌడ్, పందిళ్ల పరశురాములు గౌడ్, తిరుపతి గౌడ్, దేవయ్య గౌడ్, వెంకట్ గౌడ్, ప్రతీప్ గౌడ్, బలరాం గౌడ్, గంట రమేష్, రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకు పోలీస్.. భద్రతపై భరోసా!

► ఆదివారం పేటలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించిన మంథని సీఐ స్వామి





రామగిరి, నవంబర్ 04 (ప్రజాజ్యోతి): పోలీసులకు, ప్రజలకు మధ్య దూరాన్ని తగ్గించి గ్రామాల్లో భద్రతపై భరోసా కల్పించడమే లక్ష్యంగా రామగిరి మండలంలోని ఆదివారంపేటలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. మంథని సీఐ స్వామి ప్రజలతో నేరుగా మాట్లాడి గ్రామంలో పరిస్థితులు, సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలకు ఏ ఆపద వచ్చినా పోలీసు శాఖ అండగా ఉంటుందని, సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని సీఐ పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గుర్తుతెలియని ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తలు వివరించారు. ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవడం, నేరాల నివారణపై అవగాహన కల్పించడం ద్వారా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోందని తెలిపారు. ప్రజలు పోలీసులపై నమ్మకంతో సహకరించినప్పుడే నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రామగిరి, ముత్తారం ఎస్సైలు తాడవేని శ్రీనివాస్, రవికుమార్, గ్రామ సర్పంచ్ ఇల్లందుల సంజీవ్, ఉపసర్పంచ్ మేకల శ్రీశైలం, మైదం వరప్రసాద్, ఉట్ల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.77 కోట్లతో పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి బాటలు

- రూ.7 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు
- యూఐడీఎఫ్ నిధులు రూ.62.23 కోట్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు
- అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
- ప్రజల సహకారంతో పెద్దపల్లిని సుందర పట్టణంగా తీర్చిదిద్దుతాం: ప్రభుత్వ విప్ విజయరమణ రావు



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 4 ప్రజా జ్యోతి: పెద్దపల్లి పట్టణ రూపురేఖలను మార్చే దిశగా ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని రాష్ట్రప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. వివిధ పథకాల ద్వారా సుమారు రూ.77 కోట్లతో పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని తెలిపారు. పట్టణ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. పెద్దపల్లి పట్టణంలోని 5వ వార్డులో రూ.3.85 కోట్లు, 9వ వార్డులో రూ.2.45 కోట్లు, 10వ వార్డులో రూ.3.24 కోట్లు, 11వ వార్డులో రూ.2.93 కోట్ల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణ అభివృద్ధి కోసం రూ.62.23 కోట్ల యూఐడీఎఫ్ నిధులు మంజూరు చేయించామని, ఈ నిధులతో అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. గత ఏడాది టీయూఎఫ్ఐడీసీ ద్వారా రూ.35 కోట్లు, డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా రూ.15 కోట్లు మంజూరు చేయించి పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు గుర్తుచేశారు. పట్టణంలో రూ.7 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి కూడా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలో నూతన బస్సు డిపో, బైపాస్ రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి ఆధునీకరణ, డబుల్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర సమస్యల పరిష్కారంకోసం ప్రజాప్రతినిధులు, అధికారులను సంప్రదించాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, కమిషనర్, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వార్డుల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యుల సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా పనిచేద్దాం

- రాష్ట్రవ్యాప్తంగా విస్తృత పోరాటాలకు సిద్ధం కావాలి
- వార్డు సభ్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్

కొత్తపల్లి / నవంబర్ 4, (ప్రజా జ్యోతి) కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వార్డు సభ్యుల ముఖ్య నేతల సమావేశం జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు కామెర తిరుమల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వార్డు సభ్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో లక్షకు పైచిలుకగా ఉన్న వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. భారతదేశంలో నాలుగు రాష్ట్రాలలో వార్డు సభ్యులకు కనీస గౌరవ వేతనం అందిస్తున్నారని దానిని ప్రాతిపదికగా తీసుకొని తెలంగాణ రాష్ట్రంలో కూడా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో వార్డు సభ్యులకు గౌరవ వేతనం 5000 వేలు ఇవ్వాలని హెల్త్ కార్డు 10 లక్షల రూపాయలు ఇవ్వాలని జీవిత ప్రమాద బీమా కింద ఎవరైనా వార్డు సభ్యులు అకాల మరణం చెందితే 20 లక్షల రూపాయల పరిహారాన్ని అందివ్వాలని రాష్ట్రంలో 500 కోట్లతో వార్డు సభ్యుల ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని గ్రామీణ ప్రాంతాలలో వార్డు సభ్యులు ఎటువంటి లాభాపేక్ష లేకుండా పనిచేస్తున్నారని తక్షణమే ప్రభుత్వం గుర్తించి శిలాఫలకాలపై వారి పేరును ముద్రించాలని కోరారు. ప్రధాన డిమాండ్ల సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా గత పది నెలలుగా నిరంతరం పోరాటం చేస్తున్నామని భవిష్యత్తులో పోరాటాన్ని మరింత ఉధృతం చేయడం కోసం తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బోట్ల కార్తీక్ ఆధ్వర్యంలో డిసెంబర్ 29న కరీంనగర్ లో నిర్వహించే బహిరంగ సభలో మన తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వార్డు సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుముల నవీన్ కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల సాంబయ్య, బొబ్బటి శ్రీకాంత్, పబ్బ మహేష్ గౌడ్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీదేవి, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు అమ్మిగల్ల గోపాల్, కరీంనగర్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కామెర తిరుమల లక్ష్మీ నారాయణ, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలు గంగాధర గంగ జమున వెంకటరమణ, రాష్ట్ర గౌరవ సలహాదారు గడప కోటేష్ కుమార్, వివిధ జిల్లాల ప్రధాన కార్యదర్శిలు ఉపాధ్యక్షులు అధికార ప్రతినిధులు నియోజకవర్గ ఇన్చార్జిలు పాల్గొన్నారు.



మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మంథనిలో మరింత అభివృద్ధి

■ మున్సిపల్ చైర్మన్ పోడ్నాల శ్రీనివాస్



మంథని, నవంబర్ 04 (ప్రజాజ్యోతి): రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో మంథని మున్సిపాలిటీ పరిధిలో మరింత అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ పోడ్నాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలు నూతన రోడ్లు విస్తరణ, సైడ్ డ్రైన్ల నిర్మాణ పనులు శ్రీనివాస్ ప్రారంభించారు. డిఎంఎఫ్‌టి నిధులు రూ. 90 లక్షలతో కన్యకాపర మేశ్వరి దేవాలయం నుంచి ప్రణవి కాలేజ్ వరకు నూతన రోడ్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ పోడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక కౌన్సిలర్ శ్రీమతి జంబోజు శ్రీమతి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇప్పటికే వివిధ వార్డుల్లో రోడ్ల విస్తరణ డ్రైనేజీల నిర్మాణంతో పాటు ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈ పనుల ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కలగడంతో పాటు మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించనుందన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో మంజూరైన డిఎంఎఫ్ టి నిధులతో పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

మంథనిలో తొలి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం... మంథని మున్సిపాలిటీ పరిధిలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో మొట్టమొదట నిర్మాణం పూర్తిచేసుకున్న ఇంటి గృహప్రవేశ కార్యక్రమం మున్సిపల్ చైర్మన్ పోడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోచమ్మవాడలో కౌన్సిలర్ శ్రీమతి లైశెట్టి రజిత సమక్షంలో లబ్ధిదారులైన బోనగిరి అనూష – హరీష్ దంపతులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్ పోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో ఇందిరమ్మ ఇల్లు మంజూర అయిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారమవుతోందని పేర్కొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం... రేషన్ షాప్ డీలర్ బండారి జ్యోతి రేషన్ షాపులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ పోడ్నాల శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు జంబోజు శ్రీమతి, ఎల్లెంకి వంశీధర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు జంబోజు సమ్మయ్య, లైశెట్టి రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంకుస్, స్థానికులు పాల్గొన్నారు.



తుఫాను విద్యుత్ పునరుద్ధరణలో సత్యం పవర్ సిస్టమ్స్ కీలక పాత్ర

సుల్తానాబాద్ నవంబర్ 4 (ప్రజా జ్యోతి)



తుఫానుతో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు తమ సంస్థ తరపున ప్రత్యేక చొరవ తీసుకున్నామని సత్యం పవర్ సిస్టమ్స్ చైర్మన్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ అన్నారు. సుమారు 35 మంది నైపుణ్యం కలిగిన సిబ్బందితో పాటు ఆగర్ మిషన్లు, వాహనాలు, ఆధునిక పరికరాలను సమకూర్చుకుని ఆంధ్రప్రదేశ్ లోని కోనసీమ జిల్లా అమలాపురం ప్రాంతంలో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టామని తెలిపారు. నగరం సబ్‌స్టేషన్ పరిధిలో దెబ్బతిన్న 33 కేవీ ఇన్‌కమింగ్, 11 కేవీ అవుట్ గోయింగ్ విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టి సరఫరా పునరుద్ధరణకు కృషి చేశామన్నారు. పొదలాడ, మామిడికుదురు, తాటిపాక, పెద్దపట్నం లంక తదితర గ్రామాల్లో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాల ఏర్పాటు, లైన్ల మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టామని పేర్కొన్నారు. తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షిస్తూ సిబ్బందితో కలిసి పనిచేశానని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పనులు వేగంగా పూర్తి చేశామన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించడం సామాజిక బాధ్యతగా భావించి ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యామని, భవిష్యత్తులోనూ విద్యుత్ శాఖకు అవసరమైన సహకారం అందిస్తామని ప్రవీణ్ కుమార్ అన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్

ముత్తారం, నవంబర్ 04 (ప్రజా జ్యోతి) మండలంలోని ఓడేడు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దాసరి భాగ్య కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా భాగ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న ఓడేడు మాజీ ఉప సర్పంచ్ దేవునూరి భానుకుమార్‌ను పరామర్శించరు. మరియు రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీనియర్ రిపోర్టర్ ఏలువాక కుమార్‌ను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముత్తారం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి, ముత్తారం సర్పంచ్ సుధాటి రవీందర్ రావు, లక్కారం సర్పంచ్ అత్తే చంద్రమౌళి, మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు నూనె కుమార్, మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు అలువోజు రవీందర్ చారి, మాజీ సర్పంచ్ ఇల్లందుల అశోక్ గౌడ్, ,నరెడ్ల రమేష్, సీనియర్ నాయకులు శేరు స్వామి, రామగాళ్ల రమేష్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి గ్రామ పంచాయతీ అండ

- 25 కిలోల బియ్యం, రూ వెయ్యి ఆర్థిక సహాయం అందజేత



కోనరావుపేట, నవంబర్ 4 (ప్రజాజ్యోతి) కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామానికి చెందిన ఆదరవేణి లింగవ్వ భర్త దేవయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆదుకుంది. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ జిన్న అనూష అనిల్ కుమార్, పాలకవర్గ సభ్యులు కలిసి బాధిత కుటుంబ సభ్యులకు 25 కిలోల బియ్యంతో పాటు రూ.వెయ్యి రూపాయల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. గ్రామంలో ఎవరైనా కుటుంబ సభ్యులను కోల్పోయి ఆపదలో ఉన్నప్పుడు వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో గ్రామ పంచాయతీ తరపున ఈ సహాయాన్ని అందించినట్లు తెలిపారు. దేవయ్య మృతి పట్ల బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మొకనపెల్లి బాలరాజు, చిద్రవేణి నరేష్, జాగిరి ఆనందం, గ్రామస్తులు రేగుల పరశురాములు, జాగిరి శివ, ప్రవీణ్, బాల రాజు, దేవరాజు, దేవయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కురిక్యాలలో పరిశుభ్రమైన వాతావరణమే లక్ష్యంగా సరికొత్త పనులు!

గంగాధర 04/నవంబర్/2026: (ప్రజా జ్యోతి): గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని పెంపొందించడం, దీర్ఘకాలిక మురుగునీటి సమస్యలను శాశ్వతంగా దూరం చేయడమే లక్ష్యంగా గంగాధర మండలం కురిక్యాల గ్రామ పంచాయతీ పరిధిలో సరికొత్త అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బుధవారం గ్రామంలో 'వీబీ–జీ రామ్ జీ' పథకం కింద అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 'మ్యాజిక్ డ్రైనేజీ' నిర్మాణ పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన మరియు మార్కింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

›› ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో స్థల పరిశీలన

గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేసేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి, & జిల్లా డిప్యూటీ సీఈఓ ధమ్మని రాము ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన స్థానిక సర్పంచ్ కడారి రేణుకా – కనకయ్యతో కలిసి ప్రతిపాదిత నిర్మాణ స్థలాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సాంకేతిక నిబంధనలకు అనుగుణంగా, రాబోయే రోజుల్లో మురుగునీటి నిల్వలు లేకుండా సజావుగా సాగిపోయేలా డ్రైనేజీ నిర్మాణ పనుల కొరకు అధికారుల సమక్షంలో మార్కింగ్ ప్రక్రియను పూర్తి చేశారు.



›› మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

గ్రామస్తులకు మెరుగైన జీవన ప్రమాణాలు, పరిశుభ్రమైన పరిసరాలను అందించడమే ఈ సరికొత్త పనుల ముఖ్య ఉద్దేశమని ఎంపీడీవో డి. రాము ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మ్యాజిక్ డ్రైనేజీల నిర్మాణం ద్వారా మురుగునీరు రోడ్లపైకి రాకుండా భూగర్భంలోనే ఇంకిపోయేలా శాస్త్రీయంగా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సత్యాప్రకష్, పంచాయతీ కార్యదర్శి వనిత, మేట్ మరియు వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "మన కురిక్యాల గ్రామ అభివృద్ధే మన లక్ష్యం – ప్రజల సంక్షేమమే మన ధ్యేయం" అనే నినాదంతో సర్పంచ్ కడారి రేణుకా – కనకయ్య సమిష్టిగా ముందుకు సాగుతుండటంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్, లీడ్ బ్యాంకు ఇన్‌చార్జి ఆధ్వర్యంలో ప్రజలకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సబ్సిడీ పథకాలు, వ్యాపార రుణాలు, మహిళా సంఘాలకు అందించే రుణాలు, బ్యాంకుల ద్వారా లభించే ఇతర సేవల గురించి అధికారులు వివరించారు. గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రజలకు అందిస్తున్న వివిధ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళా సంఘాలు బ్యాంకుల ద్వారా పొందుతున్న రుణాలను ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి ఉపయోగించుకోవాలని, తీసుకున్న రుణాలను నిర్దీత గడువులో క్రమం తప్పకుండా తిరిగి చెల్లించాలని కోరారు. అలాగే యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో శివసాయి ట్రావెల్స్‌కు చెందిన సతీష్ వద్ద రూ.25 వేల వరకు నగదు డిపాజిట్, విత్‌డ్రా చేసుకునే సదుపాయం కల్పించినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు ఈ సేవను కూడా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, బ్యాంకు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మీసేవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



ఎల్లారెడ్డిపేట, నవంబర్ 04 (ప్రజా జ్యోతి): ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తూ, వేగవంతమైన, పారదర్శకమైన సేవలందించడంలో మీసేవ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ నవ్యజ్యోతి అన్నారు. మీసేవ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మీసేవ ఆపరేటర్లు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నవ్యజ్యోతి మాట్లాడుతూ.. డిజిటల్ సాంకేతికత ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు సులభంగా, వేగంగా అందించడంలో మీసేవ విశేష సేవలందిస్తోందన్నారు. డిజిటల్ తెలంగాణ నిర్మాణంలో మీసేవ కీలక భాగస్వామిగా నిలుస్తోందని పేర్కొంటూ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మీసేవ నిర్వాహకులు గద్దం జితేందర్, కూర రవికుమార్, లగిశెట్టి శ్రీనివాస్, మీసం నరేష్, నెవూరి మల్లేశం, సతీష్, ఆదిత్య, నర్సయ్య మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన ఆన్‌లైన్ సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దివ్యజ్యోతి, నాయబ్ తహసీల్దార్ వేణు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణ్, సాహితీ, గ్రామ పాలన అధికారులు, తహసీల్దార్ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హిమ్మత్ నగర్ లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

- దళారులను నమ్మి మోసపోవద్దు, ప్రభుత్వ కేంద్రాల్లోనే వడ్లు అమ్మండి: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర 04/నవంబర్/2026: (ప్రజా జ్యోతి): రైతు సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యతగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అన్నదాతలు పండించిన ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వ కేంద్రాల్లోనే అమ్మి మద్దతు ధర పొందాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు. గంగాధర మండలం హిమ్మత్ నగర్ గ్రామ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి ఐకేపీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ.. దళారీ వ్యవస్థను ఆశ్రయించి రైతులు ఆర్థికంగా నష్టపోవద్దని హెచ్చరించారు. ప్రభుత్వం కల్పించే కనీస మద్దతు ధర రైతులకు పూర్తి రక్షణ కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, తహశీల్దార్ అంబటి రజిత, సర్పంచ్ బీర్ల ఆనందం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్, సర్పంచులు ఫోరం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, కార్యదర్శి మమత పాల్గొన్నారు.



ఖనిలో సింగరేణి స్థాయి ఫుట్ బాల్ పోటీలు ప్రారంభం



గోదావరిఖని, నవంబర్ 4 (ప్రజా జ్యోతి) :గోదావరిఖనిలో సింగరేణి స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి.స్థానిక జవహర్‌లా ల్ నెహ్రూ స్టేడియంలోబుధవారం డబ్ల్యు పి ఎస్ అండ్ జి ఎ 2026-27 ఆధ్వర్యం లో నిర్వహించిన కార్యక్రమానికి ఆర్జీ1 జీఎం డి.లలిత్ కుమార్ హాజరై పోటీ లను ప్రారంభించారు.ముందుగా ఓలంపిక్ క్రీడా పతాకాన్ని ఆవిష్కరించా రు.అనంతరం పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.ఈ పోటీల్లో భా గంగా రెండు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో తొలి రోజు మణు గూరు,ఇల్లందు ఏరియాల జట్లు బెల్లంపల్లి,మందమర్రి ఏరియాల జట్లతో తల పడ్డాయి.సింగరేణిసంస్థలోని వివిధ ఏరియాల క్రీడాకారులు తమ ప్రతిభను ప్ర దర్శించేందుకు ఈ పోటీలు మంచి వేదికగా నిలుస్తున్నాయి.ఈ సందర్భంగా లలిత్ కుమార్ మాట్లాడుతూక్రీడలు శారీరక దృఢత్వాన్ని మాత్రమే కా కుండా మానసిక స్థైర్యాన్ని,క్రమశిక్షణను,జట్టు స్ఫూర్తిని (టీమ్ వర్క్) పెంపొం దిస్తాయి. విధులతో పాటు క్రీడల్లో చురుగ్గా పాల్గొనే ఉద్యోగులే సంస్థకు అస లైన ఆదర్శ ఉద్యోగులు (మోడల్ ఎంప్లాయీస్). సింగరేణిలో ప్రస్తుతం దా దాపు 45,000 మంది కార్మికులు ఉండగా వారిలో సుమారు 50 శాతం మం దయువతే ఉన్నారు.యువ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో క్రీడల్లోకి వచ్చితమ ప్రతి భను చాటాలని,జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం అభివృద్ధి కోసం సుమారు రూ. 2.5 కోట్లతో 4-లేన్ సింథటిక్ ట్రాక్ ఏర్పాటు కాబోతోందన్నారు.భవిష్య త్తులో ఆటగాళ్లకు చక్కటి గ్రాస్ కోర్టు కూడా అందుబాటులోకి రానుందని,స్టేడి యం అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపి క్రీడలను ప్రోత్సహిస్తున్న సింగరేణి సీ ఎండి జ్యోతి బుద్ధ ప్రకాష్‌కు ధన్యవాదాలు తెలిపారు.జాతీయ స్థాయి హాకీ క్రీ డాకారుడైన సీఎండీ మార్గదర్శకంలో క్రీడల అభివృద్ధి కి మేనేజ్‌మెం ట్ పూర్తి సహకారాన్ని అందిస్తుందన్నారు.ఈ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకా రులంతా గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ అత్యుత్తమ క్రీడా స్ఫూ ర్తిని ప్రదర్శించాలని సూచించారు.కోల్ ఇండియా స్థాయి పోటీలకు ఎం పికైసింగరేణి పతాకాన్ని సగర్వంగా ఎగురవేయాని ఆకాంక్షించారు.ఈ కార్య క్రమంలో ఆర్జీ1 సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్,ఆర్జీ రీజియన్ క్రా లిటీ జీఎం వెంకట రమణ, జీఎంకు ఎస్.ఓ చంద్రశేఖర్,ఏఐటీయూసీ నాయ కులు మడ్డి ఎల్లయ్య,నాయకులు అరెల్లి పోశం, అధికారుల సంఘం ప్రతి నిధి క్రాంతి కుమార్,డిప్యూటీ పర్సనల్ మేనేజర్ వేణు,స్పోర్ట్స్ కార్యదర్శి హను మంతరావు,మణి,బాస్కరి, సేవా కార్యదర్శి బీనాసింగ్, జాయింట్ సెక్రటరీ రజిత,లేడీస్ క్లబ్ కార్యదర్శి శిరీష,స్పోర్ట్స్ సూపర్ వైజర్స్ నరేందర్ రెడ్డి అసి స్టెంట్ స్పోర్ట్స్ సూపెర్వైసోర్ పోసనెట్ అశోక్ పర్స శ్రీనివాస్, సెక్యూరిటీ అధి కారి మురళీమోహన్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ గాండ్ల రాజయ్య,వివిధ ఏరి యాల స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు,క్రీడాకారులు పాల్గొన్నారు.

ఈనెల 6న అగ్రిగోల్డ్ ఏజెంట్లు, కస్టమర్ల సమావేశం

► సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

కరీంనగర్, నవంబర్ 4 (ప్రజాజ్యోతి): అగ్రిగోల్డ్ ఏజెంట్లు,కస్టమర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6న కరీంనగర్‌లోని సీపీఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశానికి అగ్రిగోల్డ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు పశ్య పద్మ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. సీఐడీ బాండ్ల వెరిఫికేషన్ కేంద్రాన్ని కరీంనగర్‌లో ఏర్పాటు చేయడం, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఏజెంట్లు, కస్టమర్లు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.



నీటిని పొదుపుగా వాడాలి

- ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కోవాలి
- ఆర్జీవన్ జిఎం లలిత్ కుమార్



గోదావరిఖని, నవంబర్ 4 (ప్రజా జ్యోతి): నీటినిపొదుపుగావాడుకోవాలనిసిం గరేణి ఆర్జీ-1 జీఎం డి. లలిత్ కుమార్ విజ్ఞప్తి చేశారు.గోదావరి నది తీరంలో ని ఇన్‌టెక్ వెల్ ప్రాంగణంలో సివిల్ వి భాగం ఆధ్వర్యంలో కె.డి.ఎస్.వరప్ర సాద్ నేతృత్వంలో నీటి సంరక్షణపై నిర్వహించిన ప్రత్యేక అవగాహన సద స్సుకు జీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఇన్‌టెక్ వెల్ వద్ద నీటి పొ దుపు అవగాహన సదస్సు, కరపత్రాల విడుదల రానున్న వేసవి కాలంలో ఎ దురయ్యే నీటి ఎద్దడిని, ఎల్-నినో ప్ర భావాన్ని అధిగమించడానికి ప్రతి ఒ క్కరూ బాధ్యతగా నీటిని పొదుపుగా వా డాలని ఆర్జీ-1 జనరల్ మేనేజర్ డి.ల లిత్ కుమార్ పిలుపునిచ్చారు.ఈ సం దర్భంగా జీఎం మాట్లాడుతూ వర్షాకా లం ముగిసిన అక్టోబర్,నవంబర్ నెల ల్లోనే గోదావరి నదిలో నీటి ప్రవాహం తగ్గిపోయి,మార్చి,మే వేసవి నెలలను తలపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశా రు.గోదావరిఖని ప్రాంత దాహార్తిని తీర్చే ప్రధాన వనరు గోదావరి నదేనని, వేసవిలో తీవ్రనీటికొరత తలెత్తకుండా ఇక నుండి ప్రతి రోజు 15 నిమిషాలు నీటిని తక్కువ విడుదల చేస్తామని, ఇ ప్పటినుంచే ముందస్తు జాగ్రత్తలు తీసు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు.మార్చి నాటికి అంద రికీ పొదుపు అలవాటు కావాలంటే నవంబర్ నుంచే కార్యాచరణ ప్రారం భించాలని సూచించారు.నీటి సరఫరా వ్యవస్థలో వాల్వ్ ఆపరేటర్లతో సమా నంగా పంప్ ఆపరేటర్లు,ఫిట్టర్లకు కూడా గురుతర బాధ్యత ఉందని గుర్తు చేశారు.పైప్‌లైన్లుపగిలిపోకుండా నీరు వృథా కాకుండా సరైన సమయానికి పంపులు,వాల్వ్‌లు నియంత్రించడం లో సమన్వయంతో పనిచేయాలని ఆదే శించారు.క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు అందరూ బా ధ్యతాయుతంగా వ్యవహరించాలన్నా రు.ఈ సందర్భంగా ఉద్యోగులు, అధి కారులంతా కలిసి నీటిని పొదుపుగా వాడుదాంఎల్-నినోని ఎదుర్కొందాం అంటూ నినాదాలు చేశారు. అనంత రం నీటి పొదుపుపై ముద్రించిన ప్రత్యేక కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందేశాన్ని ప్రతి ఒక్కరూ తమ ఇళ్లకు తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు,పిల్లలకు సైతం వివరించి చైతన్యవంతం చేయా లని జీఎం కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఓ టు జీఎం చంద్రశేఖర్,ఏరియా పర్యావరణ అధికారి వేణు,డిప్యూటీ ఎస్ఈ (సివిల్) రాజు,ఈఈ ప్రణీత్, ఏఐటియుసి ప్రతినిధి వెంకటేశ్వర్లు, ఆఫీస్ సూపరిండెంట్ ప్రవీణ్ మేనేజ్ మెంట్ ట్రైనీ అజయ్,నూనె శ్రీనివాస్,సి నియర్ సూపర్‌వైజర్ యుగంధర్ రెడ్డి,సీనియర్ సూపర్‌వైజర్ మల్లేష్,సి నియర్ సూపర్‌వైజర్లు రవి,రామచం దర్,పెద్దపల్లి శ్రీనివాస్, స్సూపర్‌వైజర్ వెంకటేస్,శ్యామ్,ఓవర్‌సీర్ అరవింద్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్,ఇతర సి విల్ విభాగం ఇంజనీర్లు,సూపర్‌వైజ ర్లు,వాల్వ్ ఆపరేటర్లు,పంప్ ఆపరేట ర్లు,ఫిట్టర్లు పాల్గొన్నారు.

పారమిత విద్యార్థులు, జాతీయ అవార్డు గ్రహీత లలిత్ మోహన్ సాహుకు ఘన సత్కారం



కరీంనగర్ టౌన్ నవంబర్ 4(ప్రజా జ్యోతి) జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అరుదైన విజయాలు సాధించి కరీంనగర్ జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి గర్వకా రణంగా నిలిచిన పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుడు లలిత్ మోహన్ సాహును విశ్రాంత ప్రధాన ఎన్నికల కమిషనర్ సి. పార్థసారథి ఘనంగా సత్కరించి అభినందించారు. బుధవారం కరీంనగర్‌లోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆర్డీఓ షర్మిల, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుపతిరావు పాల్గొని విజేతలను ప్రశంసించారు.మధ్యప్ర దేశ్‌లోని గ్వాలియర్ ఐటీఎం యూనివర్సిటీలో అక్టోబర్ 23 నుంచి 28 వరకు నిర్వహించిన 21వ అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవం 'ఉద్భవ్ ఉత్సవ్-2026'లో పారమిత హెరిటేజ్ పాఠశాల మ్యూజిక్ బ్యాండ్ బృందం అద్భుత ప్రతిభ కనబరిచింది. వివిధ దేశాల సంగీత బృందాలతో పోటీపడి గ్రూప్ మ్యూజి కల్ బ్యాండ్ విభాగంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. వాద్య సంగీతం సోలో విభాగంలో 8వ తరగతి విద్యార్థి కిట్ల చరణ్ ప్రథమ స్థానం, ఏవీకే క్రితిక్ ద్వితీయ స్థానం సాధించి సత్తా చాటారు.ఇదే పాఠశాల సీనియర్ ఉపాధ్యా యుడు, ప్రాజెక్ట్స్ అండ్ ఇన్నోవేషన్ హెడ్ లలిత్ మోహన్ సాహు జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు పొందారు. దేశవ్యాప్తంగా ఎంపికైన టాప్-10 వినూత్న ఉపాధ్యాయుల్లో చోటు దక్కించుకోవడంతో పాటు, 'వివో ఇగ్నైట్ టీచర్ ఇన్నోవేషన్ ఫెలోషిప్-2026'కు తెలంగాణ నుంచి ఎంపికైన ఏకైక ఉపాధ్యా యుడిగా నిలిచారు. దేశవ్యాప్తంగా సుమారు 37 వేల దరఖాస్తుల నుంచి కఠిన మైన ఎంపిక ప్రక్రియ ద్వారా ఆయన ఈ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. అక్టోబర్ 28న న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పుర స్కారాన్ని అందుకున్నారు.విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో సంగీత రంగంలో ప్రతిభ చాటడం, ఉపాధ్యాయుడు వినూత్న బోధనా విధానాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని ప్రముఖులు పేర్కొ న్నారు. ఈ విజయాలు విద్యార్థుల సృజనాత్మకతకు, ఉపాధ్యాయుల అంకితభా వానికి నిదర్శనమని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సంద ర్భంగా పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావు మాట్లాడుతూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, ఉపాధ్యాయుల్లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు, ఉపా ధ్యాయులు సాధించిన విజయాలు సంస్థకు ఎంతో గర్వకారణమని తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధాన ఎన్నికల కమిషనర్ సి. పార్థసారథి, ఆర్డీఓ షర్మిల, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుపతిరావు, పారమిత విద్యాసంస్థల డైరెక్టర్ వినోద్ రావు, ఉపాధ్యాయులు లలిత్ మోహన్ సాహు, జితుమణి శర్మ, కిరణ్ సాహు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విధ్వంసాన్ని ఎదిరించండి

- టీబీజీకేఎస్ నాయకులు మాదాసు



గోదావరిఖని, నవంబర్ 4 (ప్రజా జ్యోతి) :రామగుండం పారిశ్రామిక ప్రాంతం లో ప్రభుత్వ,ప్రజా ఆస్తులను కూల్చి వేస్తున్న కాంగ్రెస్ పార్టీ చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలని టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి పిలుపు నిచ్చారు.బుధవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని యూనియన్ కేంద్ర కా ర్యాలయంలో జరిగిన ఆర్ జీ వన్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. పారిశ్రామిక ప్రాంతంలో జరిగిన అభివృద్ధిని సూచిస్తూ ఏర్పాటుచేసిన పైలానును దొడ్డిదారిన కూల్చివేయడం ఆక్షేపనియమని అన్నారు. సింగరేణి క్వార్టర్లను కూల్చి వేసి షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించడం,సింగరేణి స్థలాలలో కార్మికేతరులకు భవ నాలు నిర్మించుకోవడానికి అనుమతించడం,కార్మికుల పెద్దను కూల్చివేయడం లాంటి ద్వంద్వ నీతిని ఖండించాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న దుర్మార్గాలను,దోపిడిని ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్,టిబీజీకే ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించడాన్ని సమావేశం తీవ్రంగా ఖండిం చింది.మున్సిపల్,పోలీస్ అధికారులు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు అనుకూలం గా వ్యవహరించడం తగదన్నారు.పట్టణంలోని ఇందిరా గాంధీ విగ్రహంతో పా టు,వివిధ ముఖ్యకూడలిప్రాంతాలలోని ప్రమాదకరమైన విగ్రహాలు,నిర్మాణాలపై అనుసరించవలసిన పద్ధతులపై రాజకీయ పార్టీలు ,రామగుండం పాలకవర్గం లోని ప్రజా ప్రతినిధులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. యూని యన్ నాయకులు వడ్డేపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీబీజీకేఎస్ రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులు నూనె కొమురయ్య,కేంద్ర అధికార ప్రతినిధి పర్లపల్లి రవి,నాయకులు పోలాడి శ్రీనివాస రావు,దూట శేషగిరి,కొండ్ర అంజ య్య,ఉప్పు లేటి తిరుపతి,వాసర్ల జోసెఫ్, ఏ.గోపి, జనగామ మల్లేష్,మహేందర్ రెడ్డి,రహ మాన్, పులిపాక శంకర్, మీస రాజు,కళాధర్ రెడ్డి,అఫ్సర్,రొడ్డ సంపత్, వెంకట్ రెడ్డి, భాస్కర్,సంపత్,మల్లేష్ పాల్గొన్నారు.

పైలాన్‌ను కూల్చివేయడం దుర్మార్గం

- వెంటనే పునరుద్ధరించాలి
- కక్షసాధింపు చర్యలతో గత అభివృద్ధిని చెరిపివేయలేరు
- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



గోదావరిఖని, నవంబర్ 4 (ప్రజా జ్యోతి) : లేబర్ కోర్టు ఎదుట ఉన్న పైలాన్‌ను కూల్చివేసిన ఘటనను రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాలనలో రామగుండం ప్రాంతంలో జరిగిన అభివృద్ధికి, ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన పైలాన్‌ను కక్షపూరితంగా కూల్చివేయడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. బుధవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కేసీఆర్ పాలనలో రామగుండం నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించామని,కార్పొరేషన్ పరిధిలోని ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు,ప్రతి గల్లీలో రహదారులు,డ్రైనేజీలు,వీధి దీపాలు ఏర్పాటు చేశామని చందర్ గుర్తుచేశారు.ప్రజల అవసరాల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన అభివృద్ధి పనులకు సంబంధించిన గుర్తులను తొలగిస్తే భవిష్యత్ తరాలకు ఆ అభివృద్ధి ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు.గత పాలనలో జరిగిన అభివృద్ధిని అనవాళ్లను చెరిపివేయడం ద్వారా ప్రజల జ్ఞాపకాల నుంచి వాటిని తొలగించలేరని అన్నారు.పైలాన్ కూల్చివేత సమయంలో తాము శాంతియుతంగా నిరసనతెలిపి,జేసీబీలను నిలిపివేయాలని కోరినా పోలీసులు పట్టించుకోలేదని చందర్ ఆరోపించారు.పోలీసుల వ్యవహారశైలి ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉందని,అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే భావన కలిగించేలా పోలీసుల చర్యలు ఉన్నాయని విమర్శించారు.ప్రస్తుత పాలకులు రామగుండం ప్రాంతానికి చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని చందర్ డిమాండ్ చేశారు. అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాల్సిన పాలకులు గతంలో నిర్మించిన కట్టడాలను కూల్చివేయడంపై దృష్టి పెట్టడం సరికాదన్నారు. ప్రజల్లో విద్వేషాలు సృష్టించడం,వివాదాలకు తావివ్వడం మినహా పాలకులు సాధిస్తున్నదేమిటని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధంగా ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యతను విస్మరించి అభివృద్ధి నిర్మాణాలను ధ్వంసం చేయడం తగదన్నారు. ప్రజలు, కార్మికులు, డ్రైవర్లు ఈ కక్షసాధింపు చర్యలను గమనిస్తున్నారని చందర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ తో పాటు సంబంధిత అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడితే ప్రజల నుంచి తగిన ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కూల్చివేసిన పైలాన్‌ను వెంటనే పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.విలేకరుల ఈ సమావేశంలో రాష్ట్రనాయకులు కౌశిక హరి,ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య,కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కోతుల బెడదకు నివారణ చర్యలు



గోదావరిఖని, నవంబర్ 4 (ప్రజా జ్యోతి) : రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కోతుల బెడద నిర్మూలించేందుకు చర్యలు తీసుకున్నారు.మొదటగా అన్నపూర్ణ కాలనీ లో బుధవారం సుమారు వంద కోతులను బందించారు.నగరంలోని కోతులను పట్టి ఊరికి దూరంగా అడవుల్లోకి తరలించే ప్రక్రియ కొనసాగుతున్నదని కమీషనర్ జె.అరుణశ్రీ తెలిపారు.

7 న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

- ఎంపీడీవో సురేందర్ కుమార్ వెల్లడి



కాల్వశ్రీరాంపూర్ నవంబర్ 4 (ప్రజా జ్యోతి) కార్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని .మండల పరిషత్ సమావేశం మందిరంలో. ఈనెల 7 శనివారం రోజున ఉదయం 11:30 కు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి సురేందర్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు. సర్పంచులు హాజరుకావాలని ఆయన కోరారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

- మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్



కాల్వ శ్రీరాంపూర్ నవంబర్ 4 (ప్రజా జ్యోతి)కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని. పెగడపల్లి. పందిళ్ళ.గ్రామంలో ఇటీవల పలువురు మృతి చెందారు. ఓదెల మండలంలోని గుంపుల గ్రామంలో పలువురు మృతిచెందగా మృతులకు టుంబాలను.మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్. బుధవారం రోజున పరామర్శించి సంతాపం వెలబుచ్చారు. ఈయన వెంట మాజీ సర్పంచ్ అ టీకం శంకరయ్య గౌడ్. మాజీ ఎంపీటీసీ రావి సదానందం. తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు మోరిలో పడి మహిళ మృతి



మల్లాపూర్, నవంబర్ 4, ప్రజాజ్యోతి బట్టలు కొనుగోలు చేసేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ ప్రమాదవశాత్తు మోరిలో పడి మృతి చెందిన విషాద ఘటన మల్లాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ గ్రామానికి చెందిన చిప్ప నడిపి లక్ష్మి (58) బీడీలు చేసుకుంటూ కుటుంబంతో కలిసి జీవనం సాగిస్తోంది. మంగళవారం సాయంత్రం గ్రామంలోని స్వప్న సెలక్షన్స్‌లో బట్టలు కొనుగోలు చేయడానికి వెళ్తున్నానని భర్తకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. రాత్రి ఎంతకీ ఆమె తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు.అదే రోజు రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో గ్రామానికి చెందిన గొట్టిపడత స్వామి..లక్ష్మి తమ ఇంటి ముందు ఉన్న మోరిలో పడిపోయి ఉన్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. దీంతో వెంటనే అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు ఆమెను కాలువలో నుంచి బయటకు తీశారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హుటాహుటిన మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భర్త చిప్ప లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- ప్రతి గింజా కొనుగోలు చేస్తాం: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- కురిక్యాలలో మొదలైన వడ్ల కొనుగోళ్లు!

గంగాధర 04/నవంబర్/2026: (ప్రజా జ్యోతి): రైతులు పండించిన ప్రతి వరి గింజను ప్రభుత్వమే కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రైతులకు స్పష్టమైన భరోసానిచ్చారు. గంగాధర మండల పరిధిలోని కురిక్యాల గ్రామంలో బుధవారం వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. గ్రామాల్లోని దళారులు తక్కువ ధరలకే ఆశ చూపి రైతులను నిలువునా ముంచే ప్రమాదం ఉందని, అందుకే రైతులు ఎవరూ దళారులను నమ్మి మోసపోకుండా నేరుగా ప్రభుత్వ కేంద్రాలకే తమ ధాన్యాన్ని తీసుకురావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రతి గింజా కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. రైతులు ఇబ్బంది పడకుండా కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. గన్ని సంచులు, పరదాలు, తూకం యంత్రాలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సహకార అధికారి రామాంజనేయ చార్య, సింగిల్ విండో చైర్మన్లు వెలిచాల తిర్మల్ రావు, దూలం బాల గౌడ్, తహశీల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో డి. రాము, ఏపిఎం కుమారస్వామి, కురిక్యాల సర్పంచ్ కదారి రేణుకా – కనయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ, మాజీ జెడ్పిటిసి సత్తు కనకయ్య, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్, సర్పంచ్ల ఫోరమ్ మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, సర్పంచ్లు పడాల భాగ్యలక్ష్మి – రాజన్న, రామిడి రాజిరెడ్డి, బాస వేని శ్రీనివాస్,రేండ్ల శ్రీనివాస్, బీర్ల ఆనంద్, ఆరె తేజశ్రీ – రాజశేఖర్, మల్కాపురం రాజేశ్వరి రాజేశం, చిందం ఆంజనేయులు, కోలేపాక కవిత – మల్లేశం, ధీకొండ బాబలక్ష్మి – మధు, గుండవేని లావణ్య – తిరుపతి, గుడిరజని – ప్రవీణ్ రెడ్డి, రాచమల్ల రవి, కాంగ్రెస్ నాయకులు రొమాల రమేష్, సాగి అజయ్ రావు, రాచమల్ల భాస్కర్,గుజ్జుల బాపు రెడ్డి, అత్తపురం తిరుపతి, గంగాధర ప్రవీణ్, కదారి కుమారస్వామి,అట్ల రాజి రెడ్డి, అట్ల శేఖర్ రెడ్డి, పిట్టల కమలాకర్, వేముల అంజి, పొత్తూరి ప్రభాకర్, తాళ్ల సురేష్, జారతి సత్తన్న, ఆకుల అంజన్న, పవుల్, బెజ్జంకి కళ్యాణ్ , తాళ్ల దిలీప్, కార్యకర్తలు , రైతులు పాల్గొన్నారు.



తేనీటి విందులో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- మర్యాదపూర్వక ఆహ్వానం మేరకు 22వ వార్డు కౌన్సిలర్ ఇప్పపూల మమత అజయ్ ఇంటికి విచ్చేసిన ఎమ్మెల్యే





వేములవాడ,నవంబర్,4 ప్రజాజ్యోతి:వేములవాడ పట్టణంలోని 22వ వార్డు కౌన్సిలర్ ఇప్పపూల మమత అజయ్ ఆహ్వానం మేరకు వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వారి నివాసానికి విచ్చేసి తేనీటి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు.అనంతరం 22వ వార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై చర్చించారు.అలాగే తాడూరి మహేష్–లక్ష్మి దంపతుల కుమార్తెలను ఆశీర్వదించి, వారు ఉన్నత స్థాయికి ఎదిగి మంచి భవిష్యత్తును అందుకోవాలని ఆకాంక్షించారు. కౌన్సిలర్ ఇప్పపూల మమత అజయ్ కుమారుడిని కూడా ఆప్యాయంగా పలకరించి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ ఇప్పపూల మమత అజయ్ మాట్లాడుతూ, తమ ఆహ్వానాన్ని మన్నించి ఇంటికి విచ్చేసి, తమ ఆతిథ్యాన్ని స్వీకరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక రమేష్, ఆత్మకమిటీ చైర్మన్,ముకుంద,రెడ్డి ,మున్నూరు కాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోశెట్టి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్ ప్రవళిక మృతికి సంతాపంగా మంథని డిపోలో నల్ల బ్యాడ్జిలతో నిరసన



మంథని, నవంబర్ 04 (ప్రజాజ్యోతి): మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక పై మృతికి సంతాపంగా మంథని ఆర్టీసీ డిపోలో కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. బుధవారం మంథని డిపోలలో మొదటి డ్యూటీ నుండి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సంతాప సభ నిర్వహించి మౌనం పాటించి ప్రవళిక కండక్టర్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ప్రయాణికురాలు జరిపిన దాడిలో తీవ్రంగా గాయపడి గత పది రోజులుగా హైదరాబాద్ లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి ప్రవళిక మృతి చెందడం పట్ల మంథని డిపో సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డిపో నాయకులు మాట్లాడుతూ నిత్యం వేలాది మంది ప్రయాణికులతో మమేకమవుతూ, ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న ఆర్టీసీ కండక్టర్లపై దాడులు జరగడం అత్యంత ఆందోళనకరమన్నారు. ప్రజాసేవలో నిమగ్నమైన ఉద్యోగుల ప్రాణాలకే రక్షణ లేకపోవడం బాధాకరమన్నారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, కండక్టర్ ప్రవళిక మృతికి బాధ్యులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులకు తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మంథని డిపో మేనేజర్ రుద్ర జ్ఞానేశ్వర్, ఎస్ టి ఐ వర్జిలాల్, తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కేకేరెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గంధం రమేష్, ఐలయ్య, ఏడిసిలు సదువలయ్య,కృష్ణ, శ్రీనివాస్, విజయ్, రాములు, అంజయ్య, రామయ్య, శ్రీనివాస్ పందిల్లా, ఎల్ హెచ్ ముఖీమ్, సురేందర్ లు పాల్గొన్నారు.

పలుగురాళ్లగుట్టను పరిరక్షించాలి

- మైనింగ్ పనులను తక్షణమే నిలిపివేయాలి
- జాతీయ నాయకులు చాడ వెంకట్‌రెడ్డికి గుట్ట పరిరక్షణ కమిటీ, గ్రామస్తుల విజ్ఞప్తి



ముస్తాబాద్, నవంబర్ 4 (ప్రజా జ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని నామాపూర్, గూడూరు గ్రామాల మధ్య ఉన్న సరిహద్దు ప్రాంతం పలుగురాళ్లగుట్టను పరిరక్షించాలని, అక్కడ జరుగుతున్న మైనింగ్ పనులు, తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని పలుగురాళ్లగుట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జాతీయ నాయకులు చాడ వెంకట్‌రెడ్డిని గుట్ట వద్దకు ఆహ్వానించి, గుట్ట ప్రాధాన్యతను, అక్కడ జరుగుతున్న తవ్వకాల వల్ల రెండు గ్రామాలకు కలిగే నష్టాలను వివరించారు. గుట్టపై సమగ్ర పరిశోధన చేపట్టి, రెండు గ్రామాల ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తదుపరి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మైనింగ్ పనులను నిలిపివేయాలని, గతంలో మైనింగ్ కాంట్రాక్టు పొందిన వ్యక్తిపై విచారణ జరిపి కాంట్రాక్టును రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని చాడ వెంకట్‌రెడ్డిని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పలుగురాళ్లగుట్ట పరిరక్షణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులోనూ ఈ గుట్టను ఎలాంటి మైనింగ్ కాంట్రాక్టులకు అప్పగించకుండా కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరు గ్రామ పలుగురాళ్లగుట్ట పరిరక్షణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ చాకలి రమేష్, చెరుకు ఎల్లం, బీసీడబ్ల్యూఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గీస భిక్షపతి, సీపీఎం పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి గుంటుకు వేణు, రమేష్, రవి, రాములు, వార్డు సభ్యులు మందాటి నాంపల్లి, శ్రీనివాస్, చాకలి బాబు, నామాపూర్, గూడూరు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అధిక ధరల దోపిడీకి అడ్డుకట్ట వేస్తాం!

- ఒక్కో బాటిల్‌పై రూ.150 వరకు అదనపు వసూళ్లు..
- గ్రామ, మండల స్థాయిలో కమిటీల ఏర్పాటు
- ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలి







కోనరావుపేట, నవంబర్. 04 (ప్రజాజ్యోతి) కోనరావుపేట మండలంలో మద్యం విక్రయాల పేరుతో కొనసాగుతున్న అధిక ధరల వసూళ్లకు అడ్డకట్ట వేసేందుకు ప్రజలను సమీకరించి ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు నాయకుడు మందాల శ్రీనివాస్ తెలిపారు. గ్రామ గ్రామాన బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసి, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం బాటిళ్లను ఎమ్మార్పీ (గరిష్ఠ చిల్లర ధర) కంటే అధిక ధరలకు విక్రయిస్తూ వినియోగదారులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ అధిక ధరల వసూళ్లను అరికట్టేందుకు గ్రామ, మండల స్థాయిల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రతినిధులతో బుధవారం నిజామాబాద్ ఎల్లమ్మ ఆలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలవ్యాప్తంగా మద్యం విక్రయాల్లో జరుగుతున్న అధిక ధరల వసూళ్లు, గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ, వినియోగదారులపై పడుతున్న అదనపు ఆర్థిక భారంపై చర్చించారు. ఈ సందర్భంగా మందాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. మండలంలో మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామగ్రామాన బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. మద్యం కొనుగోలు చేసే సామాన్య ప్రజల నుంచి ఎమ్మార్పీ ధరల కంటే అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

›› ఒక్కో బాటిల్‌పై రూ.150 వరకు అదనపు భారం

మద్యం విక్రయాల్లో అధిక ధరల వసూళ్లు వినియోగదారులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయని మందాల శ్రీనివాస్ పేర్కొన్నారు. మద్యం బాటిళ్లపై ఎమ్మార్పీ ధరకు అదనంగా రూ.40 నుండి 50 వరకు వసూలు చేస్తున్నారని, గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల్లో మరో రూ.120 నుండి 150 వరకు అదనంగా తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ విధంగా ఒక్కో మద్యం బాటిల్‌పై వినియోగదారులు రూ.150 వరకు అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. మద్యం కొనుగోలు చేసే పేద ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు ఈ అధిక ధరల కారణంగా ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలు జరగాల్సి ఉండగా, కొందరు వ్యాపారులు తమ ఇష్టానుసారంగా ధరలను పెంచి విక్రయించడం అన్యాయమని పేర్కొన్నారు. మద్యం కొనుగోలు చేసే వినియోగదారుల హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

›› ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు

మండలంలో మద్యం అధిక ధరల వసూళ్లు, అక్రమ బెల్ట్‌షాపుల నిర్వహణపై పలుమార్లు ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. సంబంధిత అధికారులు స్పందించి మద్యం విక్రయాలపై పర్యవేక్షణ చేపట్టాలని, ఎమ్మార్పీ ధరలకు మించి వసూలు చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులను నియంత్రించి, మద్యం విక్రయాలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరిగేలా చూడాలని కోరారు.

›› గ్రామ, మండల స్థాయిలో కమిటీల ఏర్పాటు

మద్యం అధిక ధరల వసూళ్లను నియంత్రించేందుకు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, వినియోగదారులతో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు మందాల శ్రీనివాస్ తెలిపారు. గ్రామస్థాయిలో మద్యం విక్రయాలపై అవగాహన కల్పిస్తూ, ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా వసూలు చేసే వ్యవహారాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. మండలస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి, గ్రామాలన్నింటినీ సమన్వయం చేస్తూ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. మద్యం అధిక ధరల వసూళ్లకు అడ్డుకట్ట వేయడంతో పాటు, వినియోగదారులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

›› సమస్య పరిష్కారం కాకుంటే ఆందోళనలు

మండలంలో మద్యం అధిక ధరల వసూళ్ల సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించాలని మందాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించేలా చర్యలు తీసుకోవాలని, అక్రమ బెల్ట్‌షాపుల నిర్వహణను అరికట్టాలని కోరారు. అధికారులు స్పందించకపోతే మండల, జిల్లా స్థాయిలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని ప్రారంభించి, అధిక ధరల వసూళ్లకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తాళ్లపల్లి సతీష్ గౌడ్, వీరవేని తిరుపతి యాదవ్, వీరవేని దేవేందర్ యాదవ్, తాళ్లపల్లి శేఖర్, ఉరడి రాజు యాదవ్, నరేష్, అశోక్, రామచంద్రం, లక్ష్మణ్, అంజయ్య, సాయి రావు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

భారత సాయుధ పోరాట పితామహుడు వాసుదేవ బల్వంత ఫడ్కే

- వికుర్తి లక్ష్మీనారాయణ ప్రధానోపాధ్యాయుడు



వేములవాడ,నవంబర్,4 ప్రజాజ్యోతి: భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో "సాయుధ పోరాట పితామహుడు"గా ప్రసిద్ధి చెందిన వాసుదేవ బల్వంత ఫడ్కే 181 వ,జయంతి సందర్భంగా ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ వేములవాడలో ఫడ్కే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వికుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ " భారతదేశంలో కేవలం వినతి పత్రాలు, నిరసనలకే పరిమితం కాకుండా మొట్టమొదటిసారిగా బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటాన్ని ఫడ్కే ప్రారంభించాడని,బ్రిటిష్ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడిన భారతీయ స్వాతంత్ర్య సమర యోధుడు ఫడ్కే అని, 1876 –77 కరువు కాలంలో బ్రిటిష్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని చూసి చలించిపోయి రైతులను, గిరిజనులను సమీకరించి స్వరాజ్యం కోసం ఉద్యమించాడని,మహారాష్ట్రలోని కూలీలు, భిల్లులు, ధాంగర్లు మొదలైన తెగల సహకారంతో 'రామోషీ' అనే విప్లవ బృందాన్ని ఫడ్కే తయారు చేశారని,బ్రిటిష్ సైనికులపై హఠాత్తుగా జరిపిన గెరిల్లా దాడుల్లోని ఒకదానితో ఏకంగా పూణే నగరం పైనే ఫడ్కే పట్టు సాధించి కొద్ది రోజులు నిలబెట్టుకోవడంతో ఫడ్కే వెలుగులోకి వచ్చాడని, ఫడ్కే మహారాష్ట్రలోని రాయఘడ్ జిల్లాకు చెందిన పన్వెల్ తాలూకా షిర్ధాన్ గ్రామంలో మరాఠీ చిత్పవన్ బ్రాహ్మణ కుటుంబంలో నవంబర్ 4, 1845 లో జన్మించాడని, ఉన్నత పాఠశాల విద్యార్థిగా ఉన్న కాలంలో కుస్తీ, గుర్రపు స్వారీ వంటివి ఉత్సాహంగా నేర్చుకున్నాడని, ఆయుధాలు లేకుండా బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేయడం కష్టమని నిర్ణయించుకొని ఫడ్కే 1879లో అటవీ ప్రాంతంలో రహస్యంగా గిరిజన యువకులతో సైన్యాన్ని నెలకొల్పాడని, ఆ సైన్యం ఆయుధాలు సమీకరించేదని, ఆర్థిక అవసరాల కోసం ధనికులైన ఆంగ్లేయులను బంధించి, దోపిడీ చేసేదని, దేశవ్యాప్తంగా వలస ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏకకాలంలో అనేక దాడులను నిర్వహించడానికి వాసుదేవ బల్వంత ఫడ్కే ప్రణాళికలు రచించినా పరిమిత విజయాన్నే అందించాయని, ఒకసారి ఘనూరు గ్రామంలో బ్రిటిష్ సైన్యంతో నేరుగా తలపడ్డాడని, ఆ తర్వాత అతడిని పట్టుకోవడానికి ప్రభుత్వం బహుమతి ప్రకటించిందని, అదే సమయంలో రోహిల్లా, అరబ్బులను తన సంస్థలో చేర్చుకోవడానికి ఫడ్కే హైదరాబాద్ రాష్ట్రానికి వచ్చాడని, బ్రిటిష్ మేజర్ హెన్రీ విలియం డేనియల్, హైదరాబాద్ నిజాం పోలీస్ కమిషనర్ అబ్దుల్ హక్, తదితరులు పగలు, రాత్రి ఫడ్కే ఆచూకీ కోసం వెతికారని, 1879 జూలై 20న అతడు పండార్‌పూర్ వెళ్తున్నప్పుడు కొందరు నమ్మకద్రోహులు ఇచ్చిన సమాచారంతో బ్రిటిష్ సైనికులు అతడిని పట్టి బంధించారని, తర్వాత జీవిత ఖైదు విధించారని, 1883 ఫిబ్రవరి 13 న ఫడ్కే జైలు నుండి తప్పించుకున్నా మళ్లీ వెంటనే బ్రిటిష్ పోలీసులకు దొరికిపోయాడని, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి ఆడెన్ (యెమెన్) జైలులో నిరాహార దీక్ష చేస్తూ ఫిబ్రవరి 17,1883న తుదిశ్వాస విడిచాడని,ఫడ్కే చేసిన పోరాటాలు, త్యాగాలు భవిష్యత్తులో వచ్చిన ఎకోటోరియల్ విప్లవకారులకు మరియు బంకించంద్ర చటర్జీ రాసిన 'ఆనందమఠం' నవల లోని సంఘటనలకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని "పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, కంకెల్కార్ మోహన్, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

డిజిటల్ గవర్నెన్స్ పై అవగాహన కలిగి ఉండాలి

- అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ప్రసునాంబ
- IFMISలో నూతనంగా ప్రవేశపెట్టిన e-HRMS, e-Sanctions మాడ్యూల్స్‌పై జిల్లా అధికారులకు శిక్షణ
- డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా నూతన ఆన్‌లైన్ విధానాల అమలుపై అవగాహన



జగిత్యాల, నవంబర్ 4 ప్రజాజ్యోతి. ప్రభుత్వ ఆదేశాల మేరకు డిజిటల్ గవర్నెన్స్‌లో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అందరూ అవగాహన కలిగి ఉండాలనీ అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ప్రసునాంబ పేర్కొన్నారు. IFMIS (Integrated Financial Management and Information System)లో నూతనంగా ప్రవేశపెట్టిన e-HRMS, e-Sanctions మాడ్యూల్స్ వినియోగంపై జిల్లా అధికారులకు శిక్షణా కార్యక్రమం జిల్లా ట్రెజరీ శాఖ ద్వారా నిర్వహించారు. బుధవారం జగిత్యాల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని (IDOC) సమావేశ మందిరంలో జిల్లా ఖజానా శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల జిల్లా అధికారులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (DDOs) పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రవేశపెట్టిన e-HRMS, e-Sanctions మాడ్యూల్స్ వినియోగ విధానం, వాటి ద్వారా నిర్వహించాల్సిన పరిపాలనా, ఆర్థిక సంబంధిత కార్యకలాపాలు, ఆన్‌లైన్ ప్రక్రియలపై అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా మాడ్యూల్స్ వినియోగ సమయంలో అధికారులకు ఎదురయ్యే సందేహాలు, సాంకేతిక సమస్యలను నివృత్తి చేస్తూ, ఆయా ప్రక్రియలను ఆచరణాత్మకంగా వివరించారు. నూతన విధానాలను అధికారులు సమర్థవంతంగా వినియోగించుకునేలా అవసరమైన సూచనలు అందించారు. ప్రభుత్వం చేపడుతున్న డిజిటల్ గవర్నెన్స్ విధానంలో భాగంగా నూతన ఆన్‌లైన్ మాడ్యూల్స్‌ను అధికారులు అవగాహనతో వినియోగిస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ అధికారి పద్మ, STO విజయ్, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదింటి ఆడపడుచులకు కళ్యాణలక్ష్మి భరోసా!

- లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



ఎండపల్లి, నవంబరు 4, ప్రజా జ్యోతి అర్హులైన పేదింటి ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మి భరోసాను కల్పిస్తూ, ప్రభుత్వం అండగా ఉంటుందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు, ఈ నేపథ్యంలో జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలానికి చెందిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం మండల తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ లబ్ధిదారుల కు 36 కళ్యాణ లక్ష్మి చెక్కులు 36,04,176 అలాగే ముఖ్యమంత్రి సహాయనిధి పథకంకింద 17,69500 విలువగల 57 చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరడం ద్వారా వారి కుటుంబాల్లో ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు సామాజిక సంక్షేమానికి దోహదపడుతున్నాయి. వివాహ ఖర్చుల భారంతో ఇబ్బందులు పడే నిరుపేద తల్లిదండ్రులకు ఈ పథకాల ద్వారా ప్రభుత్వం చేయూతనిస్తోం ది. తహశీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, ఎంపీడీవో దొండ కృపాకర్, సంబంధిత అధికారులు మండలానికి చెందిన లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



రాయికల్ నవంబర్ 04 (ప్రజా జ్యోతి) మండలంలోని వడ్డెర కాలనీ గ్రామానికి చెందిన బోదాసు రాములు ఉపాధి కోసం మస్కట్‌కు వెళ్లి గుండెపోటుతో మృతి చెందడంతో, ఆయన కుటుంబ సభ్యులను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ బుధవారం పరామర్శించారు. గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామ మాజీ సర్పంచ్ నరసయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.సర్పంచ్ చంద్రశేఖర్, ఉపసర్పంచ్ రాజేష్, కొత్తపేట మాజీ సర్పంచ్ రాజేశం, మాజీ ఎంపీటీసీ మందుల శ్రీనివాస్, గ్రామ నాయకులు చిన్న పోశయ్య, లక్ష్మణ్, రాజనర్సయ్య, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించిన సాంస్కృతిక సారథి కళాకారులు

- నీరు, విద్యుత్తును పొదుపుగా వినియోగించుకోవాలి
- తక్కువ నీటితో పండే పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి



జగిత్యాల, నవంబర్ 4 ప్రజాజ్యోతి. జగిత్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే సంగంపల్లి గ్రామంలో ఎల్‌నినో ప్రభావాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కళాకారులు ఎల్‌నినో కారణంగా ఏర్పడే వాతావరణ పరిస్థితులు, వాటి ప్రభావాలు, వాటిని ఎదుర్కొనేందుకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాటలు, కళారూపాల ద్వారా అవగాహనకల్పించారు.ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, విద్యుత్తును వృథా చేయకుండా ఆదా చేయాలని సూచించారు.రైతులు వరి పంటకే పరిమితం కాకుండా తక్కువ నీటితో సాగు చేయగల చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, కందులు, పెసర్లు, నువ్వులు, కూరగాయలు వంటి పంటలను సాగు చేయాలని కోరారు. రానున్న ఎల్‌నినో పరిస్థితులను ప్రజలు ధైర్యంగా ఎదుర్కోవాలని, ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని తెలిపారు. ప్రభుత్వం అన్నివిధాలుగా ప్రజలకు అండగా ఉంటుందని, ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరిస్తూ నీటి సంరక్షణతో పాటు పొదుపు చర్యలు పాటించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉద్యోగాల కోసం జాబ్ మేళా

- జిల్లా ఉపాధి కల్పన అధికారి బి.సత్యమ్మ

జగిత్యాల, నవంబర్ 4 (ప్రజాజ్యోతి): జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గాను, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో తేదీ 07.11.2026 నాడు ప్రత్యేక ఇంటర్వ్యూలు (జాబ్ మేళా) నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి బి.సత్యమ్మ ఒక ప్రకటనలో తెలిపారు.ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఖాళీగా ఉన్న ఫైనాన్షియల్ అడ్వైజర్ పోస్టుల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయని వెల్లడించారు.అర్హత మరియు ఆసక్తి గల నిరుద్యోగ అభ్యర్థులు తమ వెంట రెస్యూమే, పదవ తరగతి మరియు ఇతర విద్యార్హతల సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్స్, ఆధార్ కార్డ్ జిరాక్స్ ప్రతులతో పాటు ఒరిజినల్స్ తీసుకుని జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు. ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

పదిహేనేళ్లకే పైథాన్‌పై పుస్తకం.. ఔరా అనిపించిన బాల మేధావి!

- 'పైథాన్ మేడ్ ఈజీ' ఆవిష్కరణ
- రచయిత ఎడ్ల విశ్వేష్ కు మంత్రి అడ్లూరి అభినందనలు



ఎండపల్లి, నవంబరు 4, ప్రజాజ్యోతి, చిన్న వయసులోనే సాంకేతిక పరిజ్ఞానంలో అసాధారణ ప్రతిభ కనబరుస్తూ ఓ బాలుడు అందరి దృష్టిని ఆకర్షించాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఆధునిక ప్రోగ్రామింగ్ భాష పైథాన్‌పై పుస్తకం రచించి ఔరా అనిపించాడు. ఎండపల్లి మండల తహశీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్ కుమారుడు ఎడ్ల విశ్వేష్ రచించిన 'పైథాన్ మేడ్ ఈజీ' పుస్తకాన్ని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధ వారం ఎండపల్లి తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్న వయసులోనే సాంకేతిక రంగంపై ఆసక్తి పెంచుకుని పుస్తక రచన చేపట్టిన విశ్వేస్‌ను మంత్రి అభినందించారు.పైథాన్ ప్రోగ్రామింగ్ భాషను విద్యార్థులు సులభంగా నేర్చుకునేలా ఈ పుస్తకాన్ని రూపొందించారు. ప్రారంభ స్థాయి నుంచి కోడింగ్‌పై పట్టు సాధించే వరకు అవసరమైన అంశాలను సరళమైన భాషలో, ఉదాహరణలతో వివరించారు. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సైన్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో పైథాన్ ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ పుస్తకం విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ..చిన్న వయసులోనే సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి పెంచుకుని పుస్తకం రచించడం అభినందనీయమన్నారు. విశ్వేస్ ప్రతిభ ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. యువత చదువుతోపాటు సృజనాత్మకత, నూతన ఆవిష్కరణలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండపల్లి తహశీల్దార్ ఎడ్ల అనిల్‌కుమార్, పిసిసి కార్యవర్గ సభ్యులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి,మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 29లోగా సీఎంఆర్ బియ్యం సరఫరా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



జగిత్యాల, నవంబర్ 04, ప్రజాజ్యోతి. రబీ 2024–25 సీజన్‌కు సంబంధించి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 2,564 ఏసీకేల సీఎంఆర్ బియ్యం సరఫరాను నవంబర్ 29, 2026లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ రైస్ మిల్లర్లను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్లు,సంబంధిత అధికారులతో పెండింగ్ సీఎంఆర్ బియ్యం సరఫరాపై సమీక్ష నిర్వహించారు. 30 ఏసీకేలలోపు పెండింగ్ ఉన్న 20 మిల్లులు రోజుకు కనీసం ఒక ఏసీకే, 30 ఏసీకేలకుపైగా పెండింగ్ ఉన్న మిల్లులు రోజుకు 2 నుంచి 3 ఏసీకేల చొప్పున సరఫరా చేయాలని సూచించారు. సరఫరాలో సమస్యలుంటే అధికారుల సహకారం తీసుకోవాలని తెలిపారు. నవంబర్ 30 నాటికి బియ్యం సరఫరా పూర్తి చేయని మిల్లులను డిఫాల్ట్ మిల్లులుగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. ప్రసూనాంబ, డీఎస్పీ జితేందర్ రెడ్డి, డీఎం జితేంద్ర ప్రసాద్, అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.


అకాల వర్షానికి నేలకొరిగిన వరి



మల్లాపూర్, నవంబర్ 4, ప్రజాజ్యోతి మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. గంటకు పైగా ఏకధాటిగా కురిసిన వర్షానికి కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నేలకొరిగింది. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సాగు కోసం పెట్టుబడులు పెట్టి, పంట కోతకు సిద్ధమవుతున్న తరుణంలో వర్షం రూపంలో ప్రకృతి కన్నెర్ర చేయడంతో అన్నదాతలు కుదేలయ్యారు. నేలకొరిగిన వరి పంటను చూసి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

రైతు భరోసా నిధుల జమపై వస్తున్న సందేశాలు అవాస్తవం

► జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్



జగిత్యాల, నవంబర్ 04(ప్రజాజ్యోతి): రైతు భరోసా పథకం కింద నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయంటూ వస్తున్న తప్పుడు సందేశాలను రైతులు నమ్మవద్దని జగిత్యాల జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న ఇటువంటి సందేశాలు పూర్తిగా అవాస్తవమని ఆయన తెలిపారు. ఈ అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి ఇప్పటికే సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. రైతులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద సందేశాల్లోని లింక్‌లను క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ , ఏటీఎం పిన్ , ఆధార్ వివరాలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీతెలియజేయవద్దని, ఇటువంటి కాల్స్‌ను నిర్లక్ష్యం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అంగన్వాడీ కేంద్రంలో ఆరోగ్య లక్ష్మి కమిటీ సమావేశం

► చిన్నారులకు అన్నప్రాసన, హెచ్‌ఆర్ పంపిణీ



బుగ్గారం, నవంబర్ 4 (ప్రజాజ్యోతి): బుగ్గారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ నక్క రాజవ్వ, ఉప సర్పంచ్ జంగ లావణ్య ఆధ్వర్యంలో ఆరోగ్య లక్ష్మి కమిటీ సమావేశం, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన చేయడంతో పాటు హెచ్‌ఆర్ పంపిణీ చేపట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ నక్క రాజవ్వ మాట్లాడుతూ ప్రతి నెల 1 నుంచి 5వ తేదీ లోపు తల్లిదండ్రులు పిల్లలను అంగన్వాడీ కేంద్రానికి తీసుకువచ్చి బరువు, ఎత్తు కొలిపించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించడం ద్వారా వారిలో మానసిక, శారీరక, మేధో వికాసం కలుగుతుందని తెలిపారు. ఆటపాటలతో విద్యాబోధన చేయడంతో పాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు.ఉప సర్పంచ్ జంగ లావణ్య మాట్లాడుతూ ఆరు నెలలు నిండిన చిన్నారులకు తల్లిపాలతో పాటు బాలామృతం అందించాలని సూచించారు.అంగన్వాడీ టీచర్లు సరిత, కరుణశ్రీ, మంజుల, ఆయా లక్ష్మి, ఆశా కార్యకర్త సత్తవ్వ, గర్భిణులు, బాలింతలు, తల్లులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం..

- కాంగ్రెస్ నాయకులు కాలర్ ఎగరేసుకునేలా ఇళ్ల నిర్మాణం
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



రాయికల్ నవంబర్ 04 (ప్రజా జ్యోతి) రాష్ట్రంలో గుడిసెలు లేని తెలంగాణ నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో నిరుపేదలకు తొలి ప్రాధాన్యం కల్పిస్తున్నామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ నాయకులు గర్వంగా కాలర్ ఎగరేసుకునేలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు.రాయికల్ మండలం చింతలూరు గ్రామ మాజీ ఉపసర్పంచ్ దరావత్ ప్రభాకర్, సునీత దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి బుధవారం ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటిని ప్రారంభించి, దంపతులకు చీరకానుక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడిసెలు, రేకుల షెడ్లలో నివసిస్తున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇళ్ల నిర్మాణానికి షేర్‌వాల్ సాంకేతికత, సిమెంట్ ఇటుకలను వినియోగించేలా స్థానిక నాయకులు చొరవ చూపడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కృషితో రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. త్వరలో రెండో విడత ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.జగిత్యాల నియోజకవర్గంలో అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేస్తామని, అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అర్హులైన పేదలను గుర్తించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.జగిత్యాల పట్టణంలోని అర్బన్ హౌసింగ్ కాలనీలో 4,520 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, కోటి రూపాయలకు పైగా నిధులతో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి ఇటీవల భూమిపూజ చేసినట్లు వివరించారు. గ్రామాల్లో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో సర్పంచ్ వనిత రమేష్, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు శేఖర్ రెడ్డి, మరిపెల్లి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కోల శ్రీనివాస్, సురేందర్ నాయక్, మోహన్ ప్రసాద్, ఉపసర్పంచ్ అల్లెపు నరసయ్య, మాజీ సర్పంచులు అనుపురం శ్రీనివాస్, మోహన్ రావు, వీఎస్ఎస్ చైర్మన్ ప్రణయ్, బాపురావు, మండల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.





చైన్ స్నాచింగ్ కేసును ఛేదించిన పోలీసులు

- నిందితుల అరెస్ట్, బంగారు పుస్తెలతాడు, బైక్ స్వాధీనం



కొడిమ్యాల, నవంబరు 4 (ప్రజాజ్యోతి): మండలంలోని సూరంపేట శివారులో మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడును అపహరించిన కేసును పోలీసులు ఛేదించారు.ఈ ఘటనకు పాల్పడిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సిఐ రాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..గంగారం తండాకు చెందిన అజ్మీర దూరి ఈ నెల 3న ఐకేపీ కేంద్రానికి వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ముగ్గురు ఆమె మెడలోని రెండున్నర తులాల పుస్తెలతాడును లాక్కెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు బుధవారం నాచుపల్లి ఇటుక బట్టీల సమీపంలో నిందితులను పట్టుకున్నారు. కోరుట్లకు చెందిన గణేష్‌తో పాటు మరో ఇద్దరు ఈ నేరానికి పాల్పడినట్లు గుర్తించారు. వారి నుంచి బంగారు పుస్తెలతాడు, తిప్పన్నపేటలో చోరీ చేసిన బైక్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సిఐ పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఎస్సై నరేష్ కుమార్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడబిడ్డల పెళ్లికి ఆర్థిక చేయూత!

♦ కళ్యాణలక్ష్మి, చెక్కులు పంపిణీ, చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్, నవంబరు 4, ప్రజాజ్యోతి వెల్గటూర్ మండలంలో పలు సంక్షేమ పథకాల లబ్ధిదారులకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం చెక్కులు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద రూ.55 లక్షలు, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ ఎఫ్) ద్వారా 52 మంది లబ్ధిదారులకు రూ.13 లక్షల విలువైన చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల వివాహాలు తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా అర్హులకు ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకాల ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా 52 మంది లబ్ధిదారులకు రూ.13 లక్షల సీఎంఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

